క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
హైదరాబాద్
7-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 197
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## పనిచేయని బిజెపి నేతలు
# అవుట్!

హై కమాండ్ సీరియస్ ఆదేశాలు
అభయ్ పాటిల్ టీం రంగంలోకి..
వణికి పోతున్న సీనియర్లు

**తెలంగాణలో బిజెపి నేతలకు షాక్ తప్పడం లేదు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని బిజెపి అధిష్టానం భావిస్తోంది. అందుకు విరుద్ధంగా కొంతమంది నేతలు సొంత అజెండాతో ముందుకు సాగుతున్నారు. ఇలా అయితే రాష్ట్రంలో అధికారంలోకి రావడం కల్లా అని తేలిపోతుంది. అందుకే హై కమాండ్ దూకుడు పెంచుతోంది. మొహమాటలకు పోకూడదని భావిస్తోంది.**



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**
పార్టీని గాడిలో పెట్టేందుకు సహా ఇంచార్జ్ అభయ్ పాటిల్, శివ ప్రకాష్, మధుకర్ లకు ప్రత్యేక బాధ్యతలు ఇచ్చారు. వీరు సమీక్షలు మొదలుపెట్టారు. ఒక్కొక్కరి జాతకాలను బయటపెట్టి చెడామడా తిట్టేస్తున్నారు. క్షేత్రస్థాయిలో

2లో



## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం

3లో

## భారత్ కీలక శక్తిగా
# ఎదుగుతోంది

ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు



న్యూఢిల్లీ అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూఢిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఢిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం

3లో

## గోషామహల్‌లో 122 ఓట్లపై రచ్చ.. ఒవైసీ ఆరోపణలతో కొత్త వివాదం

గోషామహల్‌లో 122 మంది ఓటర్ల పేర్ల
తొలగింపుకు ఫామ్-7లు సమర్పించారని ఒవైసీ ఆరోపణ
సంబంధిత జాబితాలోని వారంతా ముస్లిం ఓటర్లేనన్న ఒవైసీ
ముందే ముద్రించిన ఫామ్‌ల వినియోగంపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలని విజ్ఞప్తి
తప్పుడు దరఖాస్తులు సమర్పించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్



హైదరాబాద్: గోషామహల్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాకు సంబంధించిన వ్యవహారం రాజకీయంగా వేడెక్కింది.

2లో





## ఢిల్లీలో ప్రతిపక్షాల పోరుబాట...

### బారికేడ్ ఎక్కి రాహుల్ గాంధీ నిరసన

- బారికేడ్ దాటిన రాహుల్.. ఎన్నికల సంఘంపై పోరు ఇక ఎక్కడికి?
- ఢిల్లీలో ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ప్రతిపక్ష ఎంపీల మార్చ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్
- అక్టోబర్ 10 నుంచి కాంగ్రెస్ విస్తృత ఆందోళనలకు సిద్ధం
- సుప్రీంకోర్టులోనూ కొనసాగుతున్న ఈసీ నిర్ణయాలపై విచారణ

ఢిల్లీలో మంగళవారం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల సంఘం ప్రధాన

3లో

## బొత్సకు అంత
# ఈజీ కాదు!

వారసుల కోసం గట్టి ప్రయత్నం
పిల్లలిద్దరిని నిలబెట్టేందుకు పడరాని పాట్లు
రాజకీయంగా సంక్లిష్ట వాతావరణం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**
ఉత్తరాంధ్రలోనే బలమైన నాయకుడిగా ఎదిగారు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన పొలిటికల్ కెరీర్ అత్యంత క్లిష్టంగా మారింది. ఆయన మేనల్లుడు చిన్న శ్రీను పార్టీకి గుడ్ బై చెప్పారు.



## మాజీ మావోయిస్టులకు
# కవిత పిలుపు..

మా పార్టీలోకి రండి అంటూ ఆహ్వానం
వేములవాడ పర్యటనలో మాజీ మావోయిస్టులకు కవిత ప్రత్యేక పిలుపు
ప్రజా సమస్యలపై పని చేసేందుకు తమ రాజకీయ వేదికను వినియోగించుకోవాలని సూచన
రాజన్న ఆలయ నిర్మాణం, కోడెల సంరక్షణపై పలు అంశాలను ప్రస్తావించిన కవిత

వేములవాడ, అక్టోబర్ 6: ఒకప్పుడు అడవుల్లో ఉద్యమ బాట పట్టి.. ఆ తర్వాత సాధారణ జీవితంలోకి వచ్చిన మాజీ మావోయిస్టులకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయ ఆహ్వానం పలికారు. ప్రజా జీవితంలోకి వచ్చిన వారు ఇక ప్రజల మధ్య



2లో

## ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష...



### కేసీఆర్ కుటుంబానికి నోటీసులు!

ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
సర్వేలో 45 ఎకరాల భూమి తేడా ఉన్నట్టు గుర్తింపు
రికార్డులు సమర్పించాలని కేసీఆర్ కుటుంబానికి నోటీసులు
అదే భూమిలో అమరవీరుల కాలనీ నిర్మాణానికి ఆదేశం
జూన్ 2 నాటికి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచన

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాల భూముల సర్వే నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎర్రవల్లిలోని



## దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు

బీజేపీ పాలనలో ప్రజలకు భద్రత కరువు
బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ సంచలన వ్యాఖ్యలు
సంజయ్ దత్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
సంజయ్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్
సరదాగా చేసిన వ్యాఖ్యలని సంజయ్ దత్ వివరణ

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి.

## యెమెన్ అంతర్యుద్ధం
# ఉద్ధృతం

హౌతీల గుప్పిట్లోకి కీలక ప్రాంతాలు..
తుర్బా నగరం హౌతీలు స్వాధీనం
మరో సిటీని దక్కించేందుకు యత్నం
భారీ సైనిక చర్యను ప్రకటించిన యెమెన్

## బార్ బిల్లుపై
# కొత్త భారం..



# పనిచేయని బిజెపి నేతలు అవుట్!

పార్టీ కోసం కనీసం పనిచేయకుండా, కేవలం హైదరాబాదులోని ఏసీ రూముల్లో కూర్చుంటూ.. పార్టీ ఆఫీసు చుట్టూ లాబీయింగ్ చేసుకునే నాయకుల తీరును బయటపెట్టి కడిగేస్తున్నారు. జిల్లాల్లో పనిచేయకుండా, ప్రజల్లో తిరగకుండా పార్టీ ఆఫీసు చుట్టూ తిరుగుతూ.. మేనేజ్ చేసుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎలా అధికారంలోకి వస్తామని నిలదీస్తున్నారు.

**కార్యాలయాల్లో కాలక్షేపం..**

వాస్తవానికి బిజెపిలో క్రియాశీలక సభ్యత్వం లేని వారు సైతం.. రాష్ట్రస్థాయిలో పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తకు గుర్తింపు లేదు కానీ.. కార్యాలయాల్లో రాజకీయం చేస్తున్న వారికి మాత్రం పెద్దపీట వేస్తున్నారు. అటువంటి వారిని ఇప్పుడు అభయ్ పాటిల్ బృందం ఏరివేసే పనిలో ఉంది. పదవులు పొందిన తర్వాత ఆయా నేతలు కేవలం హైదరాబాద్ కి పరిమితమై.. హెడ్ క్వార్టర్స్ లోనే కాలక్షేపం చేస్తున్నారు. కేవలం ముగ్గురు పదాధికారులు తప్ప.. మిగిలిన వారు తమకు కేటాయించిన జిల్లాల వైపు కన్నెత్తి చూడడం లేదు. రాష్ట్రస్థాయి నేతల నియోజకవర్గాల్లో తిరగకపోతే.. జిల్లా అధ్యక్షులను ఎలా ప్రశ్నిస్తారని మీరు నేతలను నిలదీస్తున్నారు. ఇకపై పదవులు అనుభవిస్తూ జిల్లాల్లో పర్యటించని వారిపై వేటు తప్పదని.. ఏసీ గదుల్లో కూర్చుని నేతల టూర్లను ఇకపై నేరుగా అధిష్టానమే పర్యవేక్షిస్తుందని హెచ్చరించారు.

**నిధుల దుర్వినియోగం పై రచ్చ..**

మరోవైపు నిధుల దుర్వినియోగంపై కూడా బిజెపిలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విడుదల చేసిన ఎన్నికల నిధుల దుర్వినియోగంపై.. అభయ్ పాటిల్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులకు ఖర్చుల నిమిత్తం పార్టీ కేంద్రం నుంచి పంపించిన నిధులను క్షేత్రస్థాయికి చేర్చకుండా.. కొందరు నేతలు తమ సొంత ఖాతాల్లోకి మళ్లించి వాడుకున్నారని గుర్తించారు. పార్టీ నిధులను మింగేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. వారి వెనుక ఎవరున్నా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. పార్టీ సొమ్మును దుర్వినియోగం చేసిన నాయకులపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి.. జైలుకు పంపించేందుకు కూడా వెనుకడుగు వెయ్యమని హెచ్చరించారు. దీంతో బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**కఠినంగా అభయ్ పాటిల్..**

మరోవైపు అభయ్ పాటిల్ కఠినంగా ఉంటారన్న పేరు ఉంది. ఆయన వైఖరితో సీనియర్ నేతలు తెలంగాణలో కొంచెం కంగారుగా ఉన్నారు. ఆయనను తెలంగాణ బాధ్యతలను తప్పించాలని కూడా ప్రయత్నం చేశారు. అదే విషయాన్ని బాహాటంగానే ఆయన చిక్కుకొచ్చారు. తాను రాష్ట్ర బాధ్యతల నుంచి వెళ్లిపోతానని కొందరు సంబరాలు చేసుకున్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. గ్రూపు రాజకీయాలు నడుపుతూ.. లాబీయింగ్ తో పదవులు దక్కించుకునే సంస్కృతికి ఇక తెరపడినట్టేనని స్పష్టం చేశారు. బిజెపిలో పని చేయని నాయకులను పక్కన పెట్టేస్తామంటూ కూడా బాహాటంగానే హెచ్చరించారు.

# గోషామహల్‌లో 122 ఓట్లపై రచ్చ.. ఒవైసీ ఆరోపణలతో కొత్త వివాదం

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 122 మంది ఓటర్ల పేర్లను తొలగించేందుకు ముందే సిద్ధం చేసిన ఫామ్-7 దరఖాస్తులు వినియోగించారని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులు సమగ్రంగా పరిశీలించాలని ఆయన కోరారు. ఒవైసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. గోషామహల్‌లోని 28వ బూత్‌కు సంబంధించిన దరఖాస్తుల్లో 122 మంది పేర్లు ఉన్నాయని చెప్పారు. వారిలో ముస్లిం ఓటర్లు ఉన్నారని, పలువురి పేర్లు 2002 నాటి జాబితాల్లోనూ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఒకే వ్యక్తి ఇంతమంది ఓటర్లకు సంబంధించిన దరఖాస్తులు ఎలా సమర్పించగలిగారని ఆయన ప్రశ్నించారు. ఈ దరఖాస్తుల వెనుక బీజేపీ అనుకూల వ్యక్తులు ఉన్నారంటూ ఒవైసీ ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తిరస్కరించింది. తమ బూత్ స్థాయి ప్రతినిధులు ఇలాంటి భారీ సంఖ్యలో ఫామ్-7దరఖాస్తులు దాఖలు చేయలేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. మరోవైపు గోషామహల్‌లో సమర్పించిన ఫామ్‌లపై సంతకాలు లేకపోవడంతో అవి పరిశీలనకు అర్హంగా లేవని ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటర్ల పేర్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించకుండా చూడాలని, తప్పుడు ప్రకటనలు చేసినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ కోరారు. ఫామ్-7 దుర్వినియోగంపై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కూడా అధికారులను అప్రమత్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు సమర్పించినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో గోషామహల్ వ్యవహారం ఇప్పుడు ఎన్నికల యంత్రాంగం పరిశీలనలో ఉన్న అంశంగా మారింది.

# బార్ బిల్లులపై కొత్త భారం..

హైదరాబాద్, అక్టోబర్ 6: రాష్ట్రంలో బార్లకు సంబంధించిన కొత్త రుసుముపై జరుగుతున్న చర్చకు మంత్రి జూపల్లి కృష్ణారావు తెరదించారు. ప్రతిపాదిత ప్రివిలేజ్ ఫీజు కారణంగా బార్ నిర్వాహకులకు నష్టాలు వస్తాయనే వాదనను ఆయన తోసిపుచ్చారు. ఈ మార్పు వల్ల వినియోగదారులు కొంత అదనంగా చెల్లించాల్సి రావచ్చని పేర్కొన్నారు. ప్రివిలేజ్ ఫీజును వెనక్కి తీసుకోవాలని బార్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ నిరసనలకు దిగిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. బార్లకు అనుమతులు మంజూరు చేసే విధానంలో ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను కూడా పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందిన నేపథ్యంలో ఇక్కడ కూడా అదే తరహా లైసెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. మద్యం ధరల్లో మార్పులు వచ్చినప్పుడు వినియోగం భారీగా పడిపోతుందనే అభిప్రాయం సరైనది కాదని జూపల్లి అన్నారు. గత అనుభవాలను పరిశీలిస్తే ధరల పెంపుతో ప్రభుత్వానికి వచ్చే ఎక్సైజ్ ఆదాయం పెరుగుతుందని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో మద్యం ద్వారా ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం రూ.10 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్ల స్థాయికి చేరిందని మంత్రి గుర్తు చేశారు. అంటే దాదాపు 260 శాతం మేర పెరుగుదల నమోదైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆదాయం ప్రస్తుతం సుమారు రూ.40 వేల కోట్లకు చేరిందని వెల్లడించారు.ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని జూపల్లి స్పష్టం చేశారు. రాష్ట్రంలో మద్యం తయారీకి అవసరమైన నీటి విషయంలోనూ కొరత లేదని పేర్కొన్నారు. ప్రివిలేజ్ ఫీజుపై వ్యాపార వర్గాల ఆందోళనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నప్పటికీ, బార్ యాజమాన్యాలపై నష్టం పడే విధంగా నిర్ణయం లేదని మంత్రి తేల్చిచెప్పారు.

# ఎర్రవల్లి భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష...

సర్వే నంబర్ 325లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో కేవలం 343 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. దీంతో గల్లంతైన 45 ఎకరాల భూమి ఎక్కడుందో వెంటనే గుర్తించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ భూమిని గుర్తించేందుకు ఎర్రవల్లి, వెంకటాపురం గ్రామాలకు సర్వే నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, సంబంధిత రెవెన్యూ రికార్డులను సమర్పించాలంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వే నంబర్ 325లోని భూమిని అమరవీరుల కుటుంబాల కోసం కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అక్కడ 'అమరవీరుల కాలనీ' నిర్మించి, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. ఈ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగిస్తూ, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై సమగ్ర విచారణ జరపాలని గతంలో అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకే రెవెన్యూ అధికారులు ఇటీవలి వారాల్లో ఈ ప్రాంతంలో సర్వే నిర్వహించి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

# మాజీ మావోయిస్టులకు కవిత పిలుపు..

(మొదటి పేజీ తరువాయి)

ఉండి సేవ చేయాలంటే తమ పార్టీతో కలిసి పనిచేయవచ్చని ఆమె పేర్కొన్నారు. వారి చేరికతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు.వేములవాడలో పర్యటించిన కవిత తొలుత శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం రాజన్న ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో వినియోగిస్తున్న కాంక్రీట్‌పై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆగమ సంప్రదాయాలకు అనుగుణంగా కృష్ణశిలలతో నిర్మాణాలు చేపడితే ఆలయ కట్టడాలు తరతరాలకు నిలిచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు రాజన్నకు సమర్పించే కోడెల విషయంలోనూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. వాటికి తగిన ఆహారం, నీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మరణించిన కోడెలకు సంప్రదాయబద్ధమైన అంత్యక్రియలు నిర్వహించడం లేదని ఆమె ఆరోపించారు. ఆలయ యాజమాన్యం వాటి సంరక్షణపై మరింత శ్రద్ధ పెట్టాలని కోరారు. ఇదే సమయంలో సిరిసిల్ల--వేములవాడ ప్రాంతానికి సాగునీటి సౌకర్యాన్ని పెంచేలా కాళేశ్వరం ప్రాజెక్టుతో అనుసంధానమైన పనులను ముందుకు తీసుకెళ్లాలని కవిత కోరారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై కూడా కవిత విమర్శలు చేశారు.

# బొత్సకు అంత ఈజీ కాదు!

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఇన్నేళ్ల బొత్స రాజకీయం వెనుక ఒక బలమైన శక్తిగా చిన్న శ్రీను పనిచేశారు. ఆయన కింది స్థాయిలో పని చేయడం వల్లే బొత్స రాష్ట్రస్థాయిలో నాయకుడిగా ఎదగలిగారు. అటువంటి క్షేత్రస్థాయి నాయకుడిగా ఉన్న చిన్న శ్రీను బయటకు వెళ్లిపోయిన తర్వాత దారుణ పరిస్థితులు ఎదురవుతున్నాయి. అందుకే నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయారు బొత్స.

**మూడు దశాబ్దాల పాటు..**

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎదురులేకుండా వ్యవహరించారు బొత్స సత్యనారాయణ. గతంలో ఎన్నడూ లేనంతగా బలహీనంగా సాగుతోంది ఆయన రాజకీయం. ఒకప్పుడు తన కను సన్నలతో విజయనగరం రాజకీయాన్ని తన అదుపులో ఉంచుకున్నారు. ఇప్పుడు మాత్రం పూర్తి పట్టు కోల్పోయే విధంగా మారిపోయారు. గత మాదిరిగా దూకుడు పూర్తిగా అదృశ్యమై తీవ్రమైన నైరాస్యం కనిపిస్తోంది. బొత్స రాజకీయ జీవితంలో చిన్న శ్రీను కేవలం ఒక బంధువు మాత్రమే కాదు. గ్రౌండ్ లెవెల్ మేనేజ్మెంట్ లో ఆయన ప్రధాన ఇంజిన్. కార్యకర్తలను సమన్వయం చేయడం, అసంతృప్తులను బుజ్జగించడం, ఎన్నికల వ్యూహాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడం చిన్న శ్రీను కీలక పాత్ర పోషించేవారు. అలాంటి కుడి భుజం దూరం కావడంతో బొత్స శిబిరంలో అంతర్గతంగా శూన్యత ఏర్పడింది. ఆ లోటును పూడ్చేందుకు, తన వారసులకు రాజకీయ భవిష్యత్తు ఇవ్వాలన్న తొందరపాటుతో చిన్న శ్రీను ఖాళీ చేసిన భీమిలి నియోజకవర్గం వైసీపీ బాధ్యతలను తన కుమార్తెకు అప్పగించారు. మరోవైపు కుమారుడు డాక్టర్ సందీప్ ను కూడా రాజకీయాల్లో నిలబెట్టేందుకు తంటాలు పడుతున్నారు.

**చిన్న శ్రీను నిష్క్రమణతో..**

వారసులను నిలబెట్టే క్రమంలో బొత్స చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా వర్కౌట్ కావడం లేదు. సానుకూల సంకేతాలు కనిపించడం లేదు. చిన్న శ్రీను నిష్క్రమణతో క్యాడర్ మొత్తం ఆయన వెంట వెళ్లిపోయింది. దశాబ్దాలుగా బొత్సకు అత్యంత సన్నిహితంగా ఉంటూ వచ్చిన అనుచరులు, కీలక నాయకులు సైతం ఇప్పుడు ఆయన వెంట నడిచేందుకు సిద్ధపడటం లేదు. క్లిష్టమైన రాజకీయాల్లో ప్రత్యర్థులను ఢీ కొట్టి నిలబడే అనుభవం పిల్లలు ఇద్దరికీ లేదు. ఈ సమయంలో చిన్న శ్రీను ఉంటే వారి బాధ్యతలు చాలా సులువుగా మోసేవారు. మామ బొత్సకు మాదిరిగానే వారి పిల్లల రాజకీయ ఎదుగుదలకు దోహదపడేవారు. కానీ ఇప్పుడు బొత్స కు అంత ఈజీ కాదు. వారసులను పొలిటికల్ గా క్రియాశీలకం చేయడం కష్టమని కూడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు

దేశంలో మునుపటిలా శాంతియుత వాతావరణం కనిపించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచింది. బీజేపీ ప్రభుత్వాల హయాంలో ప్రజలకు భద్రత కరవైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అయితే, తన వ్యాఖ్యలు కేవలం సరదా సంభాషణలో భాగమని సంజయ్ దత్ తర్వాత వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ నేత నానా పటోలే మాట్లాడుతూ, సంజయ్ దత్ "నికార్సయిన నిజం" పలికారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. మరో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కూడా సంజయ్ దత్‌కు మద్దతిచ్చారు. ఒత్తిడి కారణంగానే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని, ఆయన మాటలు హృదయాంతరాల నుంచి వచ్చాయని అన్నారు. అయితే, శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే భిన్నంగా స్పందించారు. సంజయ్ దత్ వ్యాఖ్యలను ఆయన మాట్లాడిన సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. దేశం శాంతియుతంగానే ఉందని, ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందని తెలిపారు. "ఇక్కడ ఏదైనా తప్పుగా అనిపించిన వారు, వేరే చోటికి వెళ్లిపోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై సంజయ్ దత్ ఆదివారం స్పష్టత ఇచ్చారు. శేఖర్ సుమన్ టాక్ షోలో తాను చేసిన వ్యాఖ్యలు సరదా సంభాషణలో భాగమని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గాంధీగిరి' స్ఫూర్తితో ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ షోలో, "దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు. ఆ మంచి రోజులు మళ్లీ రావాలని శివుడిని ప్రార్థిస్తున్నా" అని సంజయ్ దత్ వ్యాఖ్యానించారు.



# యెమెన్ అంతర్యుద్ధం ఉద్ధృతం

న్యూఢిల్లీ: యెమెన్‌లో అంతర్యుద్ధం రోజు రోజుకూ ఉద్ధృతమవుతోంది. సౌదీ అరేబియా, ఇరాన్ మద్దతున్న హౌతీ రెబల్స్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జులైలో ముగిసిన తర్వాత పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. హౌతీలపై భారీ సైనిక చర్యను స్థానిక ప్రభుత్వం ప్రకటించగా... దీనికి ముందు కీలక పరిణామం చోటుచేసుకుంది. హూతీలు మరింత భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. కీలకమైన తుర్బా పట్టణాన్ని తమ నియంత్రణలోకి తెచ్చుకున్నట్టు ప్రకటించారు. అటు, యెమెన్ ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు.. హూతీల స్థావరాలపై విరుచుకుపడుతున్నాయి. మరోవైపు, యెమెన్‌లోని మూడో అతిపెద్ద నగరమైన తైజ్‌లోకి చొచ్చుకెళ్లేందుకు హౌతీలు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక ప్రభుత్వానికి కేంద్రంగా ఉన్న ఏడెన్‌ను, తైజ్‌ను కలిపే కీలక రహదారిపై తుర్బా ఉంది. తైజ్‌ను హౌతీల నుంచి రక్షించే ప్రభుత్వ బలగాలకు కీలక స్థావరంగా ఉంటూ వచ్చింది. అంతకుముందు తైజ్ శివార్లలోని అనేక ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. గత నెలఎర్ర సముద్రంలోని పోర్టు సిటీ మోఖా, బాబ్ ఎల్ మండెబ్ జల సంధిని తమ నియంత్రణలోకి తెచ్చుకున్న విషయం తెలిసిందే. మరోవైపు, హూతీల నియంత్రణలో ఉన్న భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా 'డాన్ ఆఫ్ యెమెన్' రిట స్థానిక ప్రభుత్వం భారీ సైనిక చర్యను చేపట్టింది. ఈ క్రమంలోనేబాబ్ ఎల్ మండెబ్ జలసంధిపై తాము పైచేయి సాధించామని తెలిపింది. తీరప్రాంత పట్టణం ధుబాబ్, దాని సమీపంలోని విమానాశ్రయాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. భారీ నిరసనల కారణంగా మూడు దశాబ్దాలకుపైగా సాగిన అలీ అబ్దుల్లా సలేహ్ పాలనకు 2012లో తెరపడింది. ఆధునిక యెమెన్ చరిత్రలో అత్యంత కీలకమైన రాజకీయ నేతగా సలేహ్ గుర్తింపు పొందారు. 1978 నుంచి 1990 వరకు ఉత్తర యెమెన్ అధ్యక్షుడిగా.. ఆ తర్వాత 2012లో రాజీనామా చేసే వరకు ఉమ్మడి యెమెన్ మొదటి అధ్యక్షుడిగా సేవలందించారు. సమర్థవంతమైన రాజకీయ వ్యూహ చతురతతో గుర్తింపు పొందిన ఆయన.. తన పాలనను 'పాముల పడగలపై డ్యాన్స్ చేయడం'తో పోల్చేవారు. సంక్లిష్టమైన అధికార వ్యవస్థలు, వ్యూహాత్మక పొత్తుల ద్వారా ఆయన మూడు దశాబ్దాలకు పైగా అధికారాన్ని నిలబెట్టుకున్నారు. ఉత్తర, దక్షిణ యెమెన్‌లను విలీనం చేసి 'రిపబ్లిక్ ఆఫ్ యెమెన్' ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించారు. సనా రాజధానిగా, అడెన్ ఆర్థిక రాజధానిగా ఏర్పడిన యెమెన్ రిపబ్లిక్‌కు మొదటి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1994లో జరిగిన స్వల్పకాలిక అంతర్యుద్ధంలో దక్షిణ ప్రాంత వేర్పాటువాదుల ప్రయత్నాన్ని తిప్పికొట్టి, సనా కేంద్రంగా తన కేంద్రీకృత అధికారాన్ని బలపరుచుకున్నారు. 2004--2010 ఉత్తర యెమెన్‌లోని సైదీ షియా తిరుగుబాటుదారులైన 'హౌతీ'లపై వరుసగా అనేక సైనిక చర్యలను చేపట్టారు. కానీ, 2011లో 'అరబ్ స్ప్రింగ్' ఉద్యమంతో యెమెన్‌లో తిరుగుబాటు మొదలైంది. సలేహ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో 2012 ప్రారంభంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ మన్సూర్ హాదీకి అధికారాన్ని బదిలీ చేసి, ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో దేశంలో ఏర్పడిన రాజకీయ అస్థిరతను ఆసరాగా చేసుకుని ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారులు పుంజుకున్నారు. 2014--2015 మధ్య అనూహ్యంగా హౌతీలు, అబ్దుల్లా సలేహ్ మధ్య వ్యూహాత్మక పొత్తు కుదిరింది. ఈ కూటమి మన్సూర్ హాదీ ప్రభుత్వం నుంచి సనా నగరాన్ని స్వాధీనం చేసుకుంది. చివరకు హాదీని అధికారంలోంచి దింపేశారు.

# ఈసీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ప్రతిపక్షాల పోరుబాట...

అనంతరం రాహుల్‌తో పాటు ప్రియాంక గాంధీ తదితరులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వారిని విడుదల చేసినట్లు నివేదికలు తెలిపాయి.

**ఇక్కడితో ఆగేది లేదంటున్న కాంగ్రెస్**

మంగళవారం నాటి నిరసనను కేవలం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా దీర్ఘకాలిక ఉద్యమంగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై తమ అభ్యంతరాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ' పేరుతో తదుపరి దశ కార్యక్రమాలను ప్రకటించింది. అక్టోబర్ 10 నుంచి 20 వరకు బ్లాక్ స్థాయిలో సైకిల్, బైక్ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించనుంది. కరపత్రాల పంపిణీతో పాటు జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలను కూడా చేపట్టనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఆ తర్వాత అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు బూత్ స్థాయిలో చౌపాల్స్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు.

**నవంబర్ 25, 26న మరో భారీ కదలిక**

ఆందోళనను ఢిల్లీకి మరింత విస్తరించేలా నవంబర్ 25, 26 తేదీల్లో ఆరు 'చలో ఢిల్లీ' మార్చ్‌లకు కాంగ్రెస్




ప్రణాళిక వేసింది. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి బయలుదేరే ఈ మార్చ్‌లు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ రాజధానిలో కలిసేలా కార్యక్రమాన్ని రూపొందించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తర్వాత కూడా ఈ అంశాన్ని సభలో ప్రస్తావించేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా చర్యలు తీసుకునే అంశాన్ని కూడా పార్టీ పరిశీలిస్తోంది.

**సుప్రీంకోర్టులోనూ కీలక పరిణామం**

మరోవైపు ఎన్నికల సంఘం వ్యవహారంపై సుప్రీంకోర్టులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోంది. జ్ఞానేశ్ కుమార్, కేంద్రం, ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘం నిర్ణయాలు చట్టబద్ధ విధానానికి అనుగుణంగా, అవసరమైన సమ్మతితో తీసుకున్నవేనా అనే అంశంపై




వివరాలు సమర్పించాలని కోర్టు కోరింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌పై వెంటనే సస్పెన్షన్ వంటి మధ్యంతర చర్య తీసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. కేవలం పత్రికా కథనాల ఆధారంగా తక్షణ నిర్ణయం తీసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణలో ఈ అంశాలపై మరింత పరిశీలన జరగనుంది. దీంతో ఒకవైపు రోడ్డుపై ప్రతిపక్షాల నిరసనలు.. మరోవైపు కోర్టులో న్యాయపోరాటం కొనసాగుతున్నాయి. మంగళవారం ఢిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలతో ఈ వివాదం మరింత వేడెక్కగా, రాబోయే వారాల్లో కాంగ్రెస్ చేపట్టబోయే కార్యక్రమాలతో రాజకీయంగా ఈ అంశం మరింత చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

న్యూఢిల్లీ: కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

# రైతులపై కోత.. ప్రజలపై వాత!

## దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం

## రూ.5,420 కోట్ల ట్రూ-అప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి: సుర్వి యాదయ్య గౌడ్

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :- పండుగల సమయంలో ఏ ప్రభుత్వమైనా ప్రజలకు శుభవార్తలు చెప్పి ఉపశమనం కల్పించాల్సి ఉంటుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దసరా, దీపావళి పండుగల ముందు విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపే నిర్ణయం తీసుకుందని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్ విమర్శించారు.తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (నిర్ణయం




ప్రకారం నవంబర్ 2026 నుంచి వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.5,420.23 కోట్ల ట్రూ-అప్ ఛార్జీలను వసూలు చేయనున్నారు. నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు, అనంతరం యూనిట్‌కు 50 పైసల చొప్పున అదనపు ఛార్జీలు విధించనున్నట్లు తెలిపారు.పండుగల వేళ ప్రజలకు బహుమతులు ఇవ్వాల్సింది పోయి కరెంట్ బిల్లుల రూపంలో భారం మోపడం ఎంతవరకు సమంజసం?" అని సుర్వి యాదయ్య గౌడ్ ప్రశ్నించారు.ప్రజలపై ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయాల భారం ఉందని, ఇప్పుడు విద్యుత్ బిల్లులపై అదనపు ఛార్జీలు విధించడం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు మరింత భారంగా మారుతుందని అన్నారు.రైతులకు సంబంధించిన రూ.2,214.99 కోట్ల ట్రూ-అప్ మొత్తాన్ని ప్రభుత్వం భరించనున్నప్పటికీ, మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారని పేర్కొన్నారు.ప్రజలపై అదనపు విద్యుత్ భారం మోపే నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. పండుగల సమయంలో ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని, విద్యుత్ బిల్లులపై అదనపు భారాన్ని పునఃపరిశీలించాలని ఆయన కోరారు.

# ఈనెల 8న జరిగే వికలాంగుల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**వికలాంగుల సంఘం మండల కార్యదర్శి పందుల రాజు గౌడ్**

**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:-** ఈనెల 8వ తేదీన జరిగే వికలాంగుల హక్కుల కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీల కోసం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు హైదరాబాదులో బస్సు భవన్ దగ్గర జరిగే వికలాంగుల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వికలాంగుల సంఘం కార్యదర్శి పందుల రాజు గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో వికలాంగులకు 6000 రూపాయల పింఛన్ ఇస్తామని చెప్పారు,అలాగే ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పిస్తామని హామీలు ఇచ్చి గాలికి వదిలేశారు. ఈ యొక్క హామీలు తక్షణమే అమలు చేయాలని 8 న జరిగే వికలాంగుల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసి వికలాంగుల హక్కుల కోసం పోరాడాలని కోరారు

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్-స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాష్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.మరోవైపు భారత్-స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని కొనియాడారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఈ మేరకు సోమవారం దిల్లీలో ప్రధానమంత్రి మోదీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. భారత్-స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిది. ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతికత నేడు మన పునాదికి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. నేటి శిఖరాగ్ర సమావేశంతో మన భాగస్వామ్యానికి కొత్త వేగాన్ని, కొత్త శిఖరాలను అందించబోతున్నాం. ఇది పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు కోసం రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక ప్రణాళిక. దీనితో రాబోయే 15 ఏళ్లలో భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సాధిస్తాం. స్విట్జర్లాండ్‌లో భారతదేశ ఎగుమతులకు మార్కెట్?ను పెంచడానికి, రెండు దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి మేము అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. దీనివల్ల స్విట్జర్లాండ్‌కు భారతదేశ వ్యవసాయ, ఫార్మా, వస్త్ర, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతి పెరుగుతుంది. అదే సమయంలో బయోటెక్, లైఫ్ సైన్సెస్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి భారతదేశంలోని ముఖ్యమైన రంగాల్లోకి కొత్త స్విస్ పెట్టుబడులను ఆకర్షిస్తాం. ప్రజల మధ్య సంబంధాలే మన భాగస్వామ్యానికి అతిపెద్ద బలం. ఈ రోజు సంతకం చేసిన మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్, యంగ్ ప్రొఫెషనల్స్ అగ్రిమెంట్‌తో స్విట్జర్లాండ్‌లో భారతీయ విద్యార్థులు, పరిశోధకులకు అనేక కొత్త అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన పాలన, సంప్రదింపులు, దౌత్యం పట్ల భారత్?- స్విట్జర్లాండ్ ఒకే విధమైన నిబద్ధతను పంచుకుంటున్నాయని ప్రధాని మోదీ అన్నారు.







# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహనకు ప్రాధాన్యం

## ఎన్నికల ప్రక్రియ, ఓటరు నమోదు--ఓటింగ్ విధానంపై చర్చ

## టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్,లికాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్




**కూకట్ పల్లి, అక్టోబర్ 06 (క్రైమ్ మిర్రర్) :** రానున్న రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్లలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామమోహన్ రెడ్డితో పాటు పలువురు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ కూడా కార్యక్రమంలో పాల్గొని ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ఓటరు నమోదు ప్రక్రియ, ఓటు హక్కు వినియోగించుకునే విధానం, ఓటింగ్ ప్రక్రియ తదితర అంశాలపై నాయకులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడం, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవడం, తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన అవసరంపై చర్చించారు. అలాగే పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యావంతులైన యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ సంబంధిత అంశాలు, విద్యారంగ సమస్యలు, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై నాయకులు పరస్పరం చర్చించారు. పట్టభద్రుల సమస్యలను ఎన్నికల వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ఎన్నికల ప్రక్రియపై ప్రతి అర్హత కలిగిన ఓటరుకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్వారీ శశిధర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కు గురించి తెలుసుకుని, ఎన్నికల ప్రక్రియలో చురుకుగా భాగస్వామి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఓటరు నమోదు నుంచి ఓటింగ్ వరకు ప్రతి అంశంపై ప్రజలకు సరైన సమాచారం అందించడం ద్వారా ఎన్నికలపై అవగాహన పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమం అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి వి. జగదీశ్వర్ గౌడ్, సామ రామమోహన్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పట్వారీ శశిధర్ ఆధ్వర్యంలోని బృందం తదితరులు పాల్గొన్నారు.

# యువత ముందుకువచ్చి రక్తదానం చేయాలి...లయన్ చాల్లా శ్రీనివాస్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 06 (క్రైమ్ మిర్రర్) :** యువకులు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని లయన్స్ క్లబ్ 320బి సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ అండ్ లయన్స్ క్లబ్ అఫ్ సికింద్రాబాద్ నార్త్ లుజీడిమెట్ల లోని జె ఐ ఏ భవనం లో రెండు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి 320బి సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో తమ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిఏటా కనీసం 20 వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను స్థానిక ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరించడం ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఎంతో సహాయం చేసిన వారమవుతామని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గుండె, ఊపిరితిత్తులు, సాధారణ వైద్య పరీక్షలతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ అని కూడా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరం లో సుమారు 1000 మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత మందులను కూడా పంపిణీ చేశారు. సుమారు 35 మంది వరకు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి ఈ సందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు. జీడిమెట్ల ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనేరు సాయి కిషోర్, సికింద్రాబాద్ నార్త్ క్లబ్ ప్రెసిడెంట్ ఏ.రవి కుమార్, సిద్దారెడ్డి, ఎం.సత్యనారాయణ, ఎస్ ఆర్ భాషా తదితరులు పాల్గొన్నారు.



# పేదవాడి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు... మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 06 (క్రైమ్ మిర్రర్):** పేద వాడి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ భవనాలకు మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద స్థానిక నాయకులు, లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన లబ్ధిదారుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంత ఇల్లును అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో 7000 మంది దరఖాస్తులు చేసుకోగా 5218 మంది అర్హులుగా ఉన్నారని అందులో మొదటి విడతగా డ్రా ద్వారా 480 మందిని తుది జాబితాలో ఎంపిక పేర్కొన్నారు. మొదటి విడతలో ఇండ్లు రానివారు నిరుత్సాహ పడవద్దని రెండు,మూడు, నాలుగు విడుతలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడతామని అన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా పూర్తిగా ఆన్లైన్ విధానంలో పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరిగిందని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో ప్రస్తుతం 7.5 ఎకరాల స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నామని దీనితోపాటు నియోజకవర్గంలో ఇతర ప్రభుత్వ హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. ఏడాదిలోపు ఒక్క నెల ముందుగా నిర్మాణం పూర్తి చేస్తే కాంట్రాక్టర్లకు 45 లక్షల రూపాయలు, అదేవిధంగా రెండు నెలలు ముందుగా పూర్తి చేస్తే 90 లక్షల రూపాయల ప్రోత్సాహక బహుమతి ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రెటరీ విపి గౌతమ్, కలెక్టర్ మను చౌదరి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ  ఇంచార్జ్ కులను హనుమంత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, నర్సారెడ్డి భూపతిరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బొంగునూరు కిషోర్ రెడ్డి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆల్విన్ కాలనీ ఫేస్2 లో నూతన"దావా చాయ్" షాప్ ను ప్రారంభించిన దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, అక్టోబర్ 06 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ పేస్ 2 మెయిన్ రోడ్లో ఆంజనేయులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న "దావా చాయ్" షాప్ ప్రారంభోత్సవ వేడుకకు ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై "ధాతు ఆయుర్వేదం" ఫౌండర్ గుమ్మడి వెల్లి శ్రీనివాస్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి, ప్రారంభించి దావా చాయ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 వనమూలికల మిశ్రమంతో ఈ దావా చాయ్ తయారు చేయబడుతుందని, ఈ చాయ్ తాగడం వల్ల బ్లడ్ ప్యూరిఫై అవుతుందని, అలాగే శరీరంలో రోగ నిరోధక శక్తినీ పెంచుతుందని అన్నారు. మలబద్ధకం తగ్గిస్తుందని, అధిక బరువును కూడా కంట్రోల్ చేస్తుందని తెలిపారు. ఈ దావా చాయ్ ను చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా రోజుకు ఎన్నిసార్లు అయినా తాగవచ్చని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజు గౌడ్, కొండారెడ్డి, సిహెచ్ భాస్కర్, ఈశ్వర్ రెడ్డి, స్వరాజ్యం, శ్రీనివాస్, మహేష్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.



# స్నేహమేరా జీవితం

### తిది వరకు స్నేహితులేరా శాశ్వతం

### మరణించిన స్నేహితుడి అంత్యక్రియల కోసం తక్షణ సహాయం 50,000 అందించిన ఆపద్బాంధవులు





**వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 06:** మనిషి చనిపోతే దగ్గరికి కనీసం చూసి పోవడానికి కూడా ఇష్టపడని రోజులలో ఆర్థిక సంగతులు బాగా లేక తీవ్ర అనారోగ్యంతో సహచర స్నేహితుడు మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైన పదవ తరగతి బ్యాచ్ కి చెందిన స్నేహితులు తోటి సహచర స్నేహితుడు మృతునికి కుటుంబ సభ్యుల ఆర్థిక స్తోమతను గుర్తించి తక్షణ దహన సంస్కారాల కార్యక్రమాల కోసం 50 వేల రూపాయల సహాయాన్ని అందించి " స్నేహమేరా జీవితం" అని నిరూపించుకున్నారు.. పూర్తి వివరాల్లోకి వెళ్తే మండలంలోని పాలంపేట గ్రామానికి చెందిన అప్పాల రాజు (42) అత్యంత బీద కుటుంబంలో జన్మించి చిన్నతనంలోనే అమ్మా, నాన్న, అన్నయ్య, లను పోగొట్టుకొని అత్యంత దైన్య స్థితిలో జీవిస్తున్నాడు. రాజు కు భార్య, ఇద్దరు కుమార్తెలు కాగా పాలంపేట గ్రామంలో భార్య పిల్లలతో కూలి, నాలి పనులు చేసుకుంటూ దయనీయమైన పరిస్థితిలో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో గత ఐదు సంవత్సరాల నుండి అప్పల రాజు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో రాజును బ్రతికించుకోవడం కోసం భార్య రాణి కూలీ పనులు చేస్తూ తీవ్రంగా శాయశక్తుల కృషి చేస్తూ శ్రమిస్తూ అనేక ఇబ్బందులను ఎదుర్కొని అనారోగ్యం తో ఉన్న భర్తను బ్రతికించుకోవడం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది.. ఈ క్రమంలోనే గత వారం రోజుల క్రితం భర్త రాజు కు అనారోగ్యానికి గురవడంతో ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం రాజు శ్వాస విడిచాడు. అత్యంత పేద కుటుంబం అయిన రాజు కుటుంబాన్ని చూసి అతని 1996-- 97 బ్యాచ్ చెందిన స్నేహితులు మానవత దృక్పథంతో తక్షణం సహాయంగా రాజు అంత్యక్రియల కోసం అక్షరాల 50 వేల రూపాయలు ఇచ్చి ఆపదలో ఉన్న కుటుంబాన్ని మనోధైర్యం కల్పిస్తూ ఆ కుటుంబాన్ని కి అండగా నిలిచారు.. ఆపద సమయంలో అండగా నిలిచిన క్లాస్మేట్ లు సమాజానికి ఆదర్శనీయులని, గ్రామస్తులు, బంధువులు అందరూ తరగతి స్నేహితులను అభినందించారు. ఇవే కాకుండా దశదిన కార్యక్రమాలతోపాటు, ఆ కుటుంబానికి ఆర్థిక స్తోమతను అందించే విధంగా అండదండలతో ముందుంటామని రాజు స్నేహితులు పేర్కొన్నారు. కాగ రాజుకు కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె జోత్స్న అంత్యక్రియలు నిర్వహించారు




# సేవకు దక్కిన గౌరవం...మహాత్మా గాంధీ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు

### మహాత్మా గాంధీ లీడర్‌షిప్ నేషనల్ అవార్డు అందుకున్న రమావత్ నరి నాయక్

### అవార్డ్ బాధ్యతను పెంచింది..రమావత్ నరి నాయక్

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల :** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సూరవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్, పుడమి సాహితి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి హాజరై వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు.పాలక వీడు మండలం శూన్య పహాడ్ తండాకు చెందిన గిరిజన నాయకులు రమావత్ నరి నాయక్ సామాజిక సేవా రంగంలో అందించిన సేవలను గుర్తించి మహాత్మా గాంధీ లీడర్‌షిప్ నేషనల్ అవార్డుతో సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నరి నాయక్‌కు ఈ అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింతగా సామాజిక సేవ చేయాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే వైఫల్యంతోనే మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది : శ్రీరాములు అందెల

## ప్రజా సమస్యల పరిష్కారానికై బీజేపీ శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన -- రాస్తారోకో



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, ఫాగింగ్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బడంగ్‌పేట్ సర్కిల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరై నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగంపై తగిన స్థాయిలో పోరాటం చేయడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే వైఫల్యం కారణంగానే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని ఆరోపించారు. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బడంగ్‌పేట్, నాదర్‌గుల్, బాలాపూర్, మీర్‌పేట్, జిల్లెలగూడ, ప్రశాంతి హిల్స్ తదితర ప్రాంతాల్లో ప్రజలు రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపం, ఫాగింగ్ కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు అధికంగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అందుకు తగిన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. జీహెచ్‌ఎంసీలో విలీనం అనంతరం ఈ ప్రాంతాల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని, ప్రజల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో గళమెత్తాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా సబితా ఇంద్రారెడ్డి ఈ ప్రాంత ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం అసెంబ్లీలో ఎన్నిసార్లు మాట్లాడారు? ఆమె హయాంలో నియోజకవర్గంలో చారిత్రాత్మకంగా చెప్పుకునే ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా జరిగిందా అని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజల తరఫున పోరాడుతుందని, అధికార యంత్రాంగం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులతో కలిసి శ్రీరాములు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్యని కలిసి ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రోడ్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు రేడియల్ రోడ్ నంబర్--26 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, ఫాగింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ పదాధికారులు, మహిళా మోర్చా నాయకురాళ్లు, బీజేపీ మరియు బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిహెచ్ఎంసి 60వ డివిజన్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం మెయిన్ రోడ్ నుండి ధాతు నగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం గురించి మంజూరైన 16.5 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి, పనుల సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్, జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి ఎనుగుల అనిత అనిల్ యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో 'యథేచ్ఛగా' అక్రమ నిర్మాణాలు..

### నిద్రమత్తులో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు!

### విధుల పట్ల బేఖాతరు.. బాహాటంగా భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలు

### రోడ్లను ఆక్రమిస్తూ ముందుకు చొచ్చుకొస్తున్న భారీ భవనాలు

### హౌసింగ్ బోర్డ్ నిబంధనలు గాలికి.. కనీసం కన్నెత్తి చూడని అధికారులు

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అక్రమ నిర్మాణాల పర్వం అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల ఉదాసీనత, పర్యవేక్షణా రాహిత్యాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది నిబంధనలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.హౌసింగ్ బోర్డ్ కేటాయించిన ప్లాట్ల కొలతలు, సెట్‌బ్యాక్‌లు, భవన నిర్మాణ నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి, రోడ్లపైకి చొచ్చుకువస్తూ భారీ భవనాలను నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం "మాకేమీ పట్టనట్లు" వ్యవహరించడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



**నిబంధనలు నీరుగారి.. రోడ్లు ఇరుకై!**

హౌసింగ్ బోర్డ్ కాలనీ నిబంధనల ప్రకారం భవన నిర్మాణానికి వదలాల్సిన ముందస్తు స్థలాలు (సెట్‌బ్యాక్స్), ఎత్తు పరిమితులను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు. రోడ్డు హద్దులను దాటి యథేచ్ఛగా ముందుకు వచ్చి అక్రమ నిర్మాణాలు చేపడుతుండటంతో కాలనీలో ప్రధాన రహదారులు ఇరుకుగా మారిపోతున్నాయి. భవిష్యత్తులో వాహనాల రాకపోకలకు, అత్యవసర సేవలైన అంబులెన్స్, ఫైర్ ఇంజిన్లకు తీవ్ర అంతరాయం కలిగే ప్రమాదం ఏర్పడింది.

**మౌనం వెనుక మర్మమేమిటి?**

కాలనీవాసులు స్పష్టంగా చూపిస్తున్నా, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని తెలిసినా ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం, క్షేత్రస్థాయి పరిశీలనకు రాకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలనీ ప్లానింగ్ పూర్తిగా దెబ్బతినడమే కాకుండా, నిబంధనలు పాటించే నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి!**

అత్తాపూర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం ఇప్పటికైనా స్పందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# గతంలో విక్రయించిన ప్లాట్లనే మళ్లీ అమ్మేందుకు యత్నమా?

### బండోనిపల్లి లేఅవుట్‌లో రాళ్ల తొలగింపు.. కొనుగోలుదారుల్లో ఆందోళన



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** ప్లాట్లు కొనుగోలు చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలనుకున్న వారికి అనిశ్చితి నెలకొంది. మండలంలోని బండోనిపల్లి గ్రామంలో గతంలో విక్రయించిన ప్లాట్లనే తిరిగి విక్రయించేందుకు లేఅవుట్ నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. 2012లో బండోనిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ అనుమతితో లేఅవుట్ ఏర్పాటు చేసి మొత్తం 185 ప్లాట్లను విక్రయించినట్లు తెలుస్తోంది. ఈ ప్లాట్లలో కొన్నింటిని కొనుగోలు చేసిన వారు నిబంధనల ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కూడా చేయించుకున్నారు. దీంతో భవిష్యత్తులో తమ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవచ్చనే ఆశతో ఉన్నారు.అయితే ప్రస్తుతం సదరు లేఅవుట్‌లో జేసీబీల సాయంతో ప్లాట్ నంబర్ రాళ్లను తొలగిస్తూ, స్థలాలను చదును చేసి మళ్లీ విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన ప్లాట్లను తిరిగి విక్రయించేందుకు ప్రయత్నించడం తమను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని వారు వాపోతున్నారు. తమకు సంబంధించిన రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ స్థలాల్లో గుర్తింపు రాళ్లను తొలగించడం వల్ల భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

# మందమర్రిలో కార్పొరేట్ కమిటీ ఉన్నత స్థాయి సమీక్ష

### బొగ్గు ఉత్పత్తి, అభివృద్ధి లక్ష్యాలపై సమగ్ర చర్చ




**మందమర్రి అక్టోబర్ 6 ( క్రైమ్ మిర్రర్):** మందమర్రి ఏరియాలో 2026-27, 2027-28 ఆర్థిక సంవత్సరాల బొగ్గు ఉత్పత్తి, అభివృద్ధి లక్ష్యాల సాధనపై మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి విచ్చేసిన ఆన్యువల్ ప్లాన్, టార్గెట్ కమిటీ ప్రతినిధులు జీఎంలు దేవేందర్, నరసింహారావు, డీజీఎం గాబ్రియేల్‌రాజు, గని మేనేజర్ ప్రసాద్‌లతో పాటు ఏడుగురు అనుబంధ అధికారులకు ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ .రాధాకృష్ణ నేతృత్వంలో ఘనంగా స్వాగతం పలికారు.

**ఉత్పత్తిపై క్షేత్రస్థాయి పరిశీలన**

సమావేశంలో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నమోదు చేసిన నెలవారీ బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. రాబోయే నెలల్లో చేరుకోవాల్సిన లక్ష్యాలతో పాటు, 2027-28 ఏడాదికి నిర్దేశించిన ప్రణాళికలను ఆరా తీశారు. ఓపెన్‌కాస్ట్‌లలో ఓబీ క్లియరెన్స్‌తో పాటు భూగర్భ గనుల్లో డెవలప్‌మెంట్, డిప్లరింగ్ పనుల పరిస్థితిని పరిశీలించారు. కార్మికుల ఉత్పాదకత పెంచుతూనే, భారీ యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

**అనుమతుల పురోగతిపై దృష్టి**

గనుల విస్తరణకు అత్యంత ప్రాధాన్యమైన భూసేకరణ, పునరావాసం (ఆర్ అండ్ ఆర్), పర్యావరణ (ఈసీ), అటవీ శాఖ అనుమతుల ప్రక్రియ ఎంతవరకు వచ్చిందో సమీక్షించారు. ఉత్పత్తి విషయంలో ఎదురయ్యే సాంకేతిక ఆటంకాలు, క్షేత్రస్థాయి సమస్యలను అధిగమించేందుకు కార్పొరేట్ స్థాయి నుంచి పూర్తి స్థాయిలో వనరులు, మద్దతు అందిస్తామని కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా గనుల ఏజెంట్లు, ప్రాజెక్టు అధికారులు (పీఓలు), గనుల మేనేజర్లు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

# రజక సంఘ నాయకులు వినతి పత్రం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో రజక సంఘం అధ్యక్షుడు గోలి కిష్టయ్య గారి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి గారికి ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గారికి 9 వార్డ్ నెంబర్ మహంకాళి లింగస్వామి గార్లకు వినతి పత్రం అందజేయడం జరిగింది 9వ వార్డులో రజక సంఘం భవనం ఉన్నది కావున భవనం ముందు సిసి రోడ్డును నిర్మించాలని 120 రజక కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రజక సంఘం కోశాధికారి గోలి మహేష్ రజక సంఘం కార్యవర్గ సభ్యులు గోలి అంజయ్య మాజీ ప్రధాన కార్యదర్శి గోలి అంజనేయులు రజక సంఘం నాయకులు గోలి నరేష్ రజక గోలి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్

## బాలింత మృతి ఘటనపై విచారణ.. కలెక్టర్‌కు నివేదిక

**మంచిర్యాల అక్టోబర్ 6 (క్రైమ్ మిర్రర్):** పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ నేతృత్వంలో ప్రతిభ, శ్రీనివాసా నర్సింగ్ హోమ్‌లను తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, కేస్‌షీట్లు, చికిత్స వివరాలను పరిశీలించారు. ప్రతిభ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందిన బాలింత రుచిత, శ్రీనివాసా నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందిన ఘట్టమ్మకు అందించిన వైద్య సేవలపై వివరాలు సేకరించారు. బాలింత మృతి ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, అన్ని వివరాలు సేకరించిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది వివరాలు, చికిత్సలు, పరీక్షల ధరల పట్టికలను రోగులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. అర్హత కలిగిన ఫార్మసిస్ట్‌తోనే మందులు విక్రయించాలని, ల్యాబ్ పరీక్షల ధరలను ప్రదర్శించాలని సూచించారు. ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలు పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. రోగులు, వారి బంధువులకు తగిన కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు గర్భిణులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే



ఆస్పత్రులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యులు వెంకటసాయి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రతిభ, డాక్టర్ రఘువంశీ తదితరులు పాల్గొన్నారు.




# సీఎంసీ కూల్చివేతల చర్యలు....
## 15 అనధికార నిర్మాణాలు తొలగింపు....

**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు జోన్లలో అనధికార నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు.

చేపట్టిన తనిఖీల్లో 15 అనధికార నిర్మాణాలను గుర్తించి, 15 చోట్ల కూల్చివేతలు చేపట్టారు. మరోక చోట నోటీసు జారీ చేశారు.

**జోన్ల వారీగా:**

శేర్లింగంపల్లి జోన్ - 5,, కూకట్‌పల్లి జోన్ - 4 కుత్బుల్లాపూర్ జోన్ - 6

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఎంసీ అధికారులు తెలిపారు.

# టీయూడబ్ల్యూజేహెచ్-143 నూతన అధ్యక్షుడు రాఘవ రెడ్డికి సన్మానం

### ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడికి తోటి జర్నలిస్టుల శుభాకాంక్షలు

### జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్ష



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 06:** పటాన్‌చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే-హెచ్-143 నూతన అధ్యక్షుడిగా టీవీ09 సీనియర్ జర్నలిస్ట్ దూలిపాళ్ల రాఘవ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులు రాఘవ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ అంశాలపై ఐక్యంగా ముందుకు సాగాలని వారు రాఘవ రెడ్డి ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ముక్కగల్ల యాదన్న, జోగినాథ్, శ్రీనివాస్, రాజ నర్సింహా, శ్రీకాంత్, జక్కిరెడ్డి శేఖర్ రెడ్డి, మన్నే ప్రసాద్, దోరటి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అన్నదానం



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మనవరాలు వాన్య పుట్టిన రోజు సందర్భంగా నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్ జే ఫౌండేషన్ ద్వారా వంద మంది అనాథ పిల్లలకు అన్నదానం చేయడం జరిగింది.

# పట్టభద్రుల ఓటు నమోదు చేసినదైద రవీందర్ దంపతులు

**నకిరేకల్ క్రైమ్ మిర్రర్:** నకిరేకల్: నకిరేకల్ తహశీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ యశ్వంత్ సమక్షంలో నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటును తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, స్వప్న దంపతులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# సర్ పేరుతో ఓటు చోరీ చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొడతాం

## ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు వెంటనే నిలిపివేయాలి.. సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ అఖిలపక్ష ధర్నా






**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు ప్రక్రియను చేపడుతూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలంతా కలిసి తిప్పికొడతామని శంకర్‌పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్న ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం అఖిలపక్ష నిరసన ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ డా. కిరణ్మయికి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని కోరారు. ఫారం-6, ఫారం-7కు సంబంధించిన వివాదాస్పద నిబంధనలను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. జ్ఞానేష్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల డేటా కేంద్రీకరణను నిలిపివేసి, స్థానిక ఎన్నికల అధికారులకు ఓటర్ల జాబితాల నిర్వహణపై పూర్తి ప్రాప్యత కల్పించాలని కోరారు. ఎన్నికల డేటాపై తటస్థ ఐటీ నిపుణులతో స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకత కోసం ప్రధాని, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఎంపిక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని, ఆ హక్కుకు భంగం కలిగించే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అన్నారు. డీసీసీ వైస్ ప్రెసిడెంట్ చేకూర్తి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో పారదర్శకత ఉండాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్వేద గ్రామ సర్పంచ్ శంకర్ పల్లి మండలం సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్ గౌడ్, టంగుటూరు గ్రామ సర్పంచ్ బద్దం హరిత కృష్ణ రెడ్డి, పొద్దటూరు గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ, మోకిల సర్పంచ్ శేకర్, కొత్తపల్లి సర్పంచ్ హన్మంత్ రెడ్డి, పిల్లిగుండ్ల సర్పంచ్ స్వాతి కాంత్ రెడ్డి, అంతప్పగూడ సర్పంచ్ బీరయ్య, సంకెపల్లి సర్పంచ్ శ్రీనివాస్, గోపులారం సర్పంచ్ రవీందర్ రెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్, నాయకులు గౌండ్ర సత్యం, రఘునందన్ రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్, సంకెపల్లి కావలి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# బాబుల్ రెడ్డి నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### నాలుగు రేషన్ షాపుల పరిధిలో లబ్ధిదారులకు కార్డుల అందజేత



**గండపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బాబుల్ రెడ్డి నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ శాఖ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. మాజీ వార్డు మెంబర్ సోమ శ్రీనివాస్ గుప్తాతో పాటు రేషన్ డీలర్లు సద్గుణ, కాళిదాస్, ఏ.టి. నాగరాజు, సురేష్, కోట పవన్ కుమార్ నేత, దుర్గాప్రసాద్, సోమ సందీప్ గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, జగ్గు నవీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబుల్ రెడ్డి నగర్‌లోని 394, 635, 637, 60 షాప్ నంబర్లకు సంబంధించిన నాలుగు రేషన్ దుకాణాల డీలర్ల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. కార్డులు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ మరింత సులభతరం, పారదర్శకంగా మారుతుందని అధికారులు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు కార్డుల పంపిణీ ప్రక్రియను దశలవారీగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.





# హస్తాల వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రమదానం

### దసరా ఉత్సవాల నేపథ్యంలో భారీ స్వచ్ఛత కార్యక్రమం

**గండపేట(క్రైమ్ మిర్రర్):** చింతల్మెట్‌లోని శ్రీ హస్తాల వీరభద్రస్వామి (హస్తాల వీరన్న) దేవస్థాన ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు కలిసి భారీ పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. త్వరలో జరగనున్న విజయదశమి (దసరా) ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆలయం వద్ద ఉన్న చారిత్రాత్మక కోనేరు పరిసరాల్లో దట్టంగా పెరిగిన చెట్లు, ముళ్లపొదలు, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీ యంత్రం సహాయంతో తొలగించారు. కోనేరు పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గత కొద్దిరోజులుగా హస్తాల వీరన్న కోనేరు పునరుద్ధరణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులు కోనేరు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు అనువుగా ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన హస్తాల వీరభద్రస్వామి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాల్లో భక్తులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం హస్తాల వీరభద్రస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు టి. అంజన్‌కుమార్, వై. శ్రీధర్, బొక్కా బాల్‌రెడ్డి, కొమురయ్య, నరసింహ, నాగేశ్వర్, పుల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, నరేందర్, ఉపేందర్, శ్రీపాల్‌రెడ్డి, నర్సింగి యాదవ్, మనోజ్, చిన్న, సీనీతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రాత్రివేళ ఇంట్లో చోరీ.. పొరుగింటి వారే నిందితులు

### రూ.23 లక్షల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

### ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ.8.50 లక్షల నగదు, మొబైల్స్, సుత్తి, స్క్రూడ్రైవర్ స్వాధీనం



**గండపేట(క్రైమ్ మిర్రర్):** రాత్రివేళ ఇంట్లో చొరబడి భారీగా నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు బాధితుడికి పొరుగువారే కావడం గమనార్హం. వారి నుంచి రూ.8.50 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక సుత్తి, ఒక స్క్రూడ్రైవర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఈ ఘటన సెప్టెంబర్ 25–26 మధ్య రాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌లోని మదీనా మసీదు సమీపంలో ఉన్న ఇంట్లో జరిగింది. బాధితుడు సయ్యద్ హమీద్ వ్యాపారి. ఇంట్లో నగదు ఉంచుతారనే విషయాన్ని అదే ప్రాంతానికి చెందిన నిందితుడు మహమ్మద్ ఉస్మాన్ (28) తెలుసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఉస్మాన్ తన స్నేహితుడు, అదే ప్రాంతానికి చెందిన లిలిసయ్యద్ అన్వర్ (20)కు ఈ విషయం చెప్పడంతో ఇద్దరూ కలిసి చోరీకి పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 25న బాధితుడు తన పిల్లల ఫంక్షన్‌ను ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించి, పొరుగువారైన నిందితులను కూడా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. ఫంక్షన్‌కు హాజరైన అనంతరం ఇద్దరూ తమ ఇళ్లకు వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో బాధితుడి ఇంటిపైకి ఎక్కి చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అన్వర్ ఇంటి టెర్రస్‌పై ఉండి బయట వ్యక్తుల కదలికలను గమనించగా, ఉస్మాన్ సుత్తి, స్క్రూడ్రైవర్‌తో ఇంట్లోకి ప్రవేశించినట్లు వెల్లడించారు. బెడ్‌రూమ్‌ల తలుపుల తాళాలను పగులగొట్టిన నిందితుడు, అల్మారాను కూడా ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.23 లక్షల నగదు, సుమారు 5 తులాల బంగారు నెక్లెస్, చైన్, చెవి టాప్స్ అపహరించినట్లు పోలీసులు తెలిపారు. మొత్తం చోరీ సొత్తు విలువ సుమారు రూ.24 లక్షలుగా పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా అత్తాపూర్ పోలీసులు, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8.50 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక సుత్తి, ఒక స్క్రూడ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నగదు, బంగారు ఆభరణాల ఆచూకీపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ అరెస్టులు రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, అదనపు డీసీపీ కె.ఎస్. రావు, రాజేంద్రనగర్ ఏసీపీ టి. శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగాయి. అత్తాపూర్ ఎస్‌హెచ్‌ఓ ఎ. సీతయ్య, రాజేంద్రనగర్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె. రవి, డీఐ బి. రాజు నాయక్తో పాటు పోలీసు సిబ్బంది దర్యాప్తులో పాల్గొన్నారు. నిందితులను పట్టుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో చురుకుగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. వారి పనితీరుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని డీసీపీ తెలిపారు.



## చిట్టీలు, అప్పుల పేరుతో భారీ వసూళ్లు?

### పలువురి నుంచి కోట్ల రూపాయలు తీసుకుని మోసం చేసినట్లు ఆరోపణలు..

### నార్సింగి పోలీసుల విచారణ

**గండపేట(క్రైమ్ మిర్రర్):** చిట్టీలు, అప్పుల పేరుతో పలువురి వద్ద భారీ మొత్తాల్లో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై నార్సింగి పోలీసులు విచారణ చేపట్టారు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బల్లి సురేందర్ ఏ సూరిపై ఈ మేరకు ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుదారు ముంగి అమరేందర్ రెడ్డి తన వద్ద నుంచి సురేందర్ రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడని, ఇందుకు భద్రతగా రూ.25 లక్షల విలువైన చెక్కును ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా చిట్టీల పేరుతో పలువురు వ్యక్తుల నుంచి క్రమం తప్పకుండా డబ్బులు వసూలు చేసి, చిట్టీలు పూర్తయిన అనంతరం వారికి చెల్లించాల్సిన మొత్తాలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా పలువురు బాధితుల నుంచి కోట్ల రూపాయల మేరకు డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఇతర వ్యక్తుల వద్ద నుంచి కూడా భారీ మొత్తాల్లో డబ్బులు తీసుకున్నట్లు సమాచారం ఉండటంతో పోలీసులు దర్యాప్తును విస్తరించనున్నారు. బాధితుల సంఖ్య, వారి నుంచి తీసుకున్న మొత్తం, చిట్టీల వివరాలు, బ్యాంకు ఖాతాలు, యూపీఐ లావాదేవీలు, డబ్బుల వినియోగం, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించనున్నారు. అలాగే తనపై ఉన్న ఆర్థిక బాధ్యతలకు సంబంధించి సురేందర్ ఇన్సాల్వెన్సీ పిటిషన్ దాఖలు చేసినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలను సైతం పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అందిన ఫిర్యాదు, ఆరోపణలపై చట్టపరమైన ప్రక్రియలో భాగంగా విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో నేరం జరిగినట్లు నిర్ధారణై, తగిన ఆధారాలు లభించిన పక్షంలో సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సురేందర్ వద్ద చిట్టీలు, అప్పులు లేదా ఇతర ఆర్థిక లావాదేవీల ద్వారా డబ్బులు చెల్లించి, తిరిగి పొందలేకపోయిన బాధితులు తమ వద్ద ఉన్న రసీదులు, బ్యాంకు/యూపీఐ లావాదేవీల వివరాలు, వాట్సాప్ సందేశాలు, చిట్టీ పత్రాలు, ఇతర ఆధారాలతో నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. బాధితుల నుంచి అందే సమాచారంతో కేసు దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



## శంషాబాద్‌లో భారీ ఏటీఎం చోరీ

### యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం ధ్వంసం.. రూ.30 లక్షలకు పైగా నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

**గండపేట(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని శాతంరాయి వద్ద యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు ఏటీఎంలోకి చొరబడి మిషన్‌ను ధ్వంసం చేసి అందులోని రూ.30 లక్షలకు పైగా నగదును అపహరించినట్లు ప్రాథమిక సమాచారం. అర్ధరాత్రి సమయంలో ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగులు ముందుగా ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి నగదును తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఘటన అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఏటీఎంలో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శంషాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఏటీఎం వద్ద ఆధారాలను సేకరించారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు ఏటీఎం పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. దుండగులు ఏ మార్గంలో వచ్చారు, చోరీ అనంతరం ఎటువైపు వెళ్లారు అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. చోరీకి గురైన నగదు మొత్తంపై బ్యాంకు అధికారుల నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాబుల్ రెడ్డి నగర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ




**గండపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డి నగర్ లో డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై, పౌర సరఫరాల శాఖ ఇన్స్పెక్టర్ మహేష్, అధికారులు, మైలార్‌దేవ్‌పల్లి, ప్రగతి కాలనీ, బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్ ఆటో స్టాండ్ రేషన్ షాప్ డీలర్లతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ నాలుగు రేషన్ షాపుల స్మార్ట్ కార్డులను ఒకే చోట పంపిణీ చేయడం వల్ల వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రగతి కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి షాపుల కార్డులను ఒకచోట, బాబుల్‌రెడ్డినగర్, కాటేదాన్ ఆటో స్టాండ్ రేషన్ షాపుల కార్డులను బాబుల్‌రెడ్డినగర్‌లో పంపిణీ చేసి ఉంటే బాగుండేది. అలా కాకుండా నాలుగు షాపుల కార్డులను ఒకే చోట పెట్టడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గంటల తరబడి వరుసలో నిలబడి తీరా కౌంటర్ దగ్గరకు వచ్చాక ఇక్కడ కాదు, వేరే చోట ఇస్తున్నారు అని చెప్పడంతో వినియోగదారులు మళ్లీ మరో లైన్లో నిలబడాల్సి వస్తుంది. కాబట్టి రెండు షాపుల కార్డులను ఒకే రేషన్ షాపు వద్ద, మిగతా రెండింటివి మరో రేషన్ షాపు వద్ద పంపిణీ చేస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది అని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, వివిధ పార్టీల నాయకులు వెంకటరమణగుప్తా, కోట పవన్ కుమార్ నేత, మామిడి శెట్టి శ్రీనివాస్ నేత, భాస్కర్ నేత, ఎస్.అశోక్‌కుమార్, మల్లేష్ నేత, సింహాద్రి, సురేష్, సునీల్, రామకృష్ణ, నవీన్, సంతు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను, కురుమప్ప, బాలరాజ్‌యాదవ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ విద్యార్థికి మల్‌రెడ్డి రాంరెడ్డి బాసట



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 06:** అఖిల భారత స్థాయి నీట్ పరీక్షలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థిని ఇషా లహరికి రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి బాసటగా నిలిచారు. జీహెచ్ఎంసీ తొర్రూరు డివిజన్ పరిధి కమ్మగూడ లక్ష్మీనగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జటావత్ శ్రీనివాస్–పద్మ దంపతుల కుమార్తె ఇషా లహరి నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచి... ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ సీట్ సాధించింది. ఈ నేపథ్యంలో మల్‌రెడ్డి రాంరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. లహరికి కావాల్సిన ఆర్థికసాయం, ప్రోత్సాహం అందించడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాగ్యానాయక్, భురో నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ను నిలిపివేయాలని డిమాండ్

### కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బర్తరఫ్ చేయాలని నిరసన





గండపేట(క్రైమ్ మిర్రర్): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సర్ పేరుతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బందులు కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనదని, అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె. ఆనంద్ గౌడ్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు కన్యగారి లక్ష్మి, సీపీఐ రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జె. విజయానంద్ గౌడ్, రాజేంద్రనగర్ మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, రాజేంద్రనగర్ మండల బీసీ అధ్యక్షులు జె. సదానంద్ గౌడ్, కాటేదాన్ కార్యదర్శి శ్రీరామ్, మండల నాయకులు మధు, శ్రీనివాస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిన్నజీయర్ స్వామీజీని కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### ఈ నెల 12న ఖమ్మంలో శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్ర శంకుస్థాపన



**గండపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామీజీకి పాదాభివందనం చేసి ఆయన దివ్యాశీస్సులు అందుకున్నారు. ఈ నెల 12వ తేదీన ఖమ్మం పట్టణంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్రం శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిన్నజీయర్ స్వామీజీని ఆహ్వానించారు. స్వామీజీ అమృత హస్తాల మీదుగా శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖమ్మం నగరంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర దివ్యక్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవనుందని మంత్రి పేర్కొన్నారు. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చిన్నజీయర్ స్వామీజీ దివ్యాశీస్సులతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామివారి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు.

# హైదరాబాద్‌లో 'సంస్కరణల ఉత్సవం-2026'

## పత్తి రైతులు, జౌళి పరిశ్రమ బలోపేతమే లక్ష్యం.. కీలక సంస్కరణలను ప్రదర్శించిన కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ






**గండపేట(క్రైమ్ మిర్రర్):** పత్తి రైతుల సాధికారత, పత్తి ఉత్పాదకత--నాణ్యత పెంపు, డిజిటల్ పరివర్తనతో పాటు జౌళి పరిశ్రమలో వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ చేపట్టిన పలు సంస్కరణలను హైదరాబాద్‌లో నిర్వహించిన సంస్కరణల ఉత్సవం-2026లో ప్రదర్శించారు. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖకు చెందిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ ఉత్పత్తుల విభాగం కమిషనర్, వ్యవసాయ--సహకార శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా, తెలంగాణ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్, సహకార సంఘాల రిజిస్ట్రార్, మార్కెటింగ్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) రాహుల్ రాజ్ పి.ఎస్., సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సీఈవో, సంయుక్త కార్యదర్శి (టెక్నికల్) డాక్టర్ నరేష్ బాబు ఎన్., ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ ఎం. బలరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడటం, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత తీసుకురావడం, సాంకేతికత వినియోగాన్ని పెంచడం తమ సంస్థ ప్రధాన లక్ష్యాలని వివరించారు. రైతులతో నేరుగా అనుసంధానం, పనితీరు మెరుగుదల, పత్తి వాల్యూ చెయిన్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు చేపట్టిన సంస్కరణలను వివరించారు. కపాస్ కిసాన్ యాప్, పత్తి ఉత్పాదకత మిషన్--కపాస్ క్రాంతి, పత్తి బేళ్లు, గింజల బిల్లింగ్ ప్రక్రియను డిజిటలైజ్ చేసే 'కాట్‌బిజ్' వంటి కార్యక్రమాలను ప్రదర్శించారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు సులభంగా అందించడంలో డిజిటల్ వేదికల ప్రాధాన్యాన్ని వివరించారు. ముఖ్య అతిథి కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ.. పత్తి, జౌళి రంగాల బలోపేతానికి ప్రభుత్వ విభాగాలు, రైతులు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సంప్రదాయ సాగు విధానాలతో పోలిస్తే హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టమ్ (హెచ్‌డీపీఎస్) ద్వారా కలిగే ప్రయోజనాలను ఆయన ప్రస్తావించారు. ఈ విధానాన్ని తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు సమష్టి ప్రయత్నాలు, తగిన విధానపరమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు. పత్తి, పట్టు రంగాలకు చెందిన రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా అనుభవాలను పంచుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అకోలా ప్రాంతానికి చెందిన ఓ ప్రగతిశీల రైతు హెచ్‌డీపీఎస్ సాగు విధానంపై తన అనుభవాలను పంచుకున్నారు. ప్రారంభంలో 5 వేల హెక్టార్లలో ఉన్న ఈ సాగు విధానం ప్రస్తుతం సుమారు 30 వేల హెక్టార్లకు విస్తరించిందని తెలిపారు. ఎకరాకు పత్తి దిగుబడి 12 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్ల వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. కూలీల కొరతను అధిగమించడం, యంత్రాల వినియోగం, కలుపు నియంత్రణ, పెట్టుబడి వ్యయాల తగ్గింపులో ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. గాణ సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ రాహుల్ రాజ్ పి.ఎస్. మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద పత్తి కొనుగోళ్లలో సమర్థవంతమైన కొనుగోలు వ్యవస్థలు, ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, పారదర్శక విధానాలు కీలకమని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన విభాగం సంచాలకులు డాక్టర్ ఎం. బలరాం మాట్లాడుతూ.. శాస్త్రీయ సాగు పద్ధతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, రైతులు, పరిశ్రమల మధ్య సమన్వయంతో దేశంలో పత్తి దిగుబడి, నాణ్యతను మరింత పెంచవచ్చని అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డు చేపట్టిన పలు కార్యక్రమాలను కూడా ప్రదర్శించారు. సిల్క్‌మార్క్ డిజిటలైజేషన్, సెరీ-టూరిజం, 'మేరా రేషమ్ మేరా అభిమాన్' కార్యక్రమాల గురించి వివరించారు. సిల్క్‌మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సీఈవో డాక్టర్ నరేష్ బాబు సిల్క్‌మార్క్ డిజిటలైజేషన్, సెరీ-టూరిజం ప్రణాళికలను వివరించగా, సెంట్రల్ సిల్క్ బోర్డు సైంటిస్ట్-సి డాక్టర్ విశాఖ 'మేరా రేషమ్ మేరా అభిమాన్' కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. తెలంగాణ కాటన్ మిల్లర్స్, ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి కస్తూరి కాటన్ నాణ్యత, కొనుగోలు, ప్రాసెసింగ్‌పై పరిశ్రమ దృక్కోణాన్ని వివరించారు. రైతులు, జౌళి పరిశ్రమ మధ్య బంధాన్ని బలోపేతం చేయడంలో వ్యాపార భాగస్వాముల పాత్ర కీలకమని తెలిపారు. టెక్స్‌ప్రోసిల్ జాయింట్ డైరెక్టర్ ఉదయ్ కారత్ 'కస్తూరి కాటన్ భారత్' కింద నాణ్యత, ధ్రువీకరణ, బ్రాండింగ్, ట్రేసబిలిటీ కోసం చేపట్టిన చర్యలను వీడియోల ద్వారా ప్రదర్శించారు. స్పిన్నింగ్ పరిశ్రమ ప్రతినిధి ధీరజ్ ఖేతాన్ భారతీయ పత్తి నాణ్యతపై తన అనుభవాలను పంచుకున్నారు. పత్తి, పట్టు రంగాలకు చెందిన రైతులు, పరిశ్రమ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర భాగస్వాములు తమ అనుభవాలను పంచుకున్నారు. ఆధునిక సాంకేతికత, డిజిటల్ విధానాలు, మెరుగైన అనుసంధానం ద్వారా పత్తి, పట్టు వాల్యూ చెయిన్‌లో పారదర్శకత, ఉత్పాదకత, సామర్థ్యం, పోటీతత్వాన్ని మరింత పెంచవచ్చని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. ఫార్మ్ టు ఫైబర్.. ఫైబర్ టు ఫ్యాక్టరీ.. ఫ్యాక్టరీ టు ఫ్యాషన్.. ఫ్యాషన్ టు ఫారిన్ వరకు భారత జౌళి రంగ వాల్యూ చెయిన్‌ను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో చేపడుతున్న సంస్కరణలను ఈ ఉత్సవం ద్వారా వివరించారు.

# బృందావన్ కాలనీలో డిప్యూటీ కమిషనర్ పర్యటన

## వన్ డే--వన్ వార్డ్ లో భాగంగా పౌర సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన




**గండపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన వన్ డే--వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్ బృందావన్ కాలనీ, 125వ వార్డులో పర్యటించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో నెలకొన్న పౌర సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా బృందావన్ కాలనీలోని పలు ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్.. పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థానికులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బృందావన్ కాలనీలో సుమారు 0.5 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణ పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రజల భద్రతను మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు. అలాగే కాలనీలో పనిచేయని, తగినంత వెలుతురు ఇవ్వని వీధి దీపాలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. కాలనీలో వీధి కుక్కల సమస్యను స్థానికులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై శానిటేషన్, వెటర్నరీ విభాగాలు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా రోడ్లను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, పారపిట్ వాల్స్, ఇతర నిర్మాణాలను పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలను గుర్తించి, నిబంధనల మేరకు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన వెలుతురు, రహదారి భద్రత కల్పించేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి సింగిల్ ఆర్మ్ స్ట్రీట్ లైట్ పోల్స్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడిన డిప్యూటీ కమిషనర్.. వారు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు, అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. గుర్తించిన ప్రాంతాలను ఇంజినీరింగ్, శానిటేషన్, ఇతర ఫీల్డ్ సిబ్బంది వెంటనే పరిశీలించి అవసరాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డీఈ కార్తీక్, ఎస్‌డబ్ల్యూఎం డీఈ అన్వేష్ రెడ్డి, వార్డు ఆఫీసర్ సుష్మ, బిల్ కలెక్టర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు!

## క్యాతనపల్లి, మందమర్రిల్లో అదనపు కలెక్టర్ తనిఖీలు

## మౌలిక వసతుల కల్పనకు ఆదేశం

**మందమర్రి అక్టోబర్ 6 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీల పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలను జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గృహనిర్మాణ శాఖ పి.డి., డి.ఈ., ఎ.ఈ.లతో కలిసి ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఇళ్ల నిర్మాణంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర ప్రాథమిక వసతుల కల్పన ఏ మేరకు వచ్చిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాబోయే దసరా పండుగ నాటికి క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసి, ఇళ్ల అప్పగింతకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. దసరా కల్లా గృహాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, మందమర్రి తహసీల్దార్ సతీష్ శర్మ, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ,డిప్యూటీ తహసీల్దార్, మందమర్రి మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ నేత బొక్కా బాల్‌రెడ్డి ఆగ్రహం

## ఉచిత రేషన్ బియ్యం పథకంలో కేంద్రం పాత్రను విస్మరించడంపై తీవ్ర విమర్శలు



**గండపేట(క్రైమ్ మిర్రర్):** ఉప్పరపల్లిలో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పాత్రను, ప్రధాని నరేంద్ర మోదీ చిత్రాన్ని విస్మరించడంపై బీజేపీ నేత బొక్కా బాల్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం అందించడంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బొక్కా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తున్న కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో కేంద్రం నిధులు అందిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేసిన రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రాలను మాత్రమే ముద్రించడం సరికాదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని గుర్తించకుండా రేషన్ కార్డులపై ప్రధాని మోదీ పేరు లేదా ఫొటో లేకపోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమానికి సంబంధించిన పథకాలపై రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని అన్నారు. కేంద్రం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పూర్తి సమాచారం ఇవ్వాలని, కేంద్రం వాటాను కూడా స్పష్టంగా తెలియజేయాలని బొక్కా బాల్‌రెడ్డి కోరారు. ఈ అంశంపై బీజేపీ తరఫున రాష్ట్ర ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొక్కా బాల్‌రెడ్డి, ఉప్పరపల్లి రేషన్ డీలర్ నరసింహా, ఎర్రబోడ రేషన్ డీలర్ తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్, భూపాల్, మనోజ్‌తో పాటు రేషన్ కార్డు లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సంజయ్ గాంధీనగర్‌లో నీటి సమస్యకు వారం రోజుల్లో పరిష్కారం

## హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు హామీ..

### స్థానికులతో కలిసి సమస్య పరిశీలన



**గండపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌షాకోట్ 123వ డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్‌లో నెలకొన్న నీటి సమస్యకు వారం రోజుల్లో పరిష్కారం చూపనున్నట్లు హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు హామీ ఇచ్చారు. స్థానికంగా నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్‌ను సంజయ్ గాంధీనగర్‌కు తీసుకువచ్చి, నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించినట్లు తలారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు వివరించడంతో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించిన అధికారులు.. సమస్యకు కారణాలను గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టి వారం రోజుల్లోగా నీటి సమస్యకు పూర్తి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు సమస్య పరిష్కారమయ్యే వరకు పరిస్థితిని పర్యవేక్షిస్తామని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్, ఏ-బ్లాక్ అధ్యక్షుడు డబ్బు నవీన్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు అంకం శ్రీనివాస్ నేత, మాజీ ఎంపీటీసీ భోగరా శ్రీనివాస్‌తో పాటు సంజయ్ గాంధీనగర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక నీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్పందించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

# మేనేజ్‌మెంట్ కోటా సీట్లు వద్దు.. మెరిట్ కోటాకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

### రాజేంద్రనగర్ క్యాంపస్‌లో మెరిట్ విద్యార్థులకు సీట్లు కేటాయించాలని డిమాండ్

### అగ్రికల్చరల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ రాజ్‌కుమార్..

**గండపేట(క్రైమ్ మిర్రర్):** వ్యవసాయ విద్యలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అగ్రికల్చరల్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మేనేజ్‌మెంట్ కోటా సహా వివిధ కోటాల పేరుతో అడ్మిషన్లు పెంచడం వల్ల మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ అనుబంధ మూడు యూనివర్సిటీలు---అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ యూనివర్సిటీలు---వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టడంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని రాజ్‌కుమార్ తెలిపారు. మూడు యూనివర్సిటీలకు విద్యార్థులు విడివిడిగా దరఖాస్తులు చేసుకోవాల్సి రావడంతో ఆర్థిక భారం పెరగడంతో పాటు ఏ యూనివర్సిటీకి కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే సమగ్రంగా, ఒకే విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించేలా ప్రస్తుత విధానాన్ని సవరించాలని ఆయన కోరారు. గత ఏడాది, ఈ ఏడాది యూజీ అడ్మిషన్ల సంఖ్యను పెంచుతున్నప్పటికీ, అందుకు



అనుగుణంగా హాస్టల్ వసతులు, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర విద్యా మౌలిక సదుపాయాలను పెంచకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాజ్‌కుమార్ అన్నారు. మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకుండా అడ్మిషన్లు పెంచడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే పరిస్థితి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూజీ ప్రవేశాల సమయంలో వివిధ కోటాల పేరుతో సీట్లను భర్తీ చేయడం వల్ల ఎంట్రన్స్ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా మెరిట్‌లో వచ్చిన విద్యార్థులకు మెయిన్ క్యాంపస్‌లో సీట్లు దక్కకుండా ఇతర క్యాంపస్‌లకు కేటాయిస్తుండగా, ఎంట్రన్స్ పరీక్షలో కనీస అర్హత సాధించని మేనేజ్‌మెంట్ కోటా అభ్యర్థులకు రాజేంద్రనగర్ క్యాంపస్‌లో సీట్లు కేటాయించడం సరికాదని పేర్కొన్నారు. కష్టపడి చదివి ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా రెగ్యులర్ (మెరిట్) కోటాలో సీట్లు పొందిన విద్యార్థులకు రాజేంద్రనగర్ క్యాంపస్‌లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మెరిట్ ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు ముందుగా సీట్లు కేటాయించి, మిగిలిన కోటాల ద్వారా భర్తీ చేసే సీట్లను ఇతర సబ్ క్యాంపస్‌లలో కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం తరఫున మూడు వ్యవసాయ అనుబంధ యూనివర్సిటీల ఉపకులపతులు, రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజ్‌కుమార్ కోరారు. గ్రామీణ ప్రాంతాలు, రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు వ్యవసాయ విద్యపై ఆధారపడుతున్న నేపథ్యంలో ప్రవేశాల ప్రక్రియలో పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కౌన్సెలింగ్ విధానాన్ని పునఃపరిశీలించి, మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయం రాజ్ భూపాల్ గౌడ్, తోకల శ్రీనివాస్ రెడ్డి

### సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్ మిలన్ సేవ కార్యక్రమం

### కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్ ముదిరాజ్.





**గండపేట(క్రైమ్ మిర్రర్):** ప్రధానమంత్రి నరేంద్రమోడీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకోని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఆధ్వర్యంలో బండ్లగూడ జాగీరులోని పీరంచెరువు, హైదర్షాకోట్, బైరాగిగూడ, హిమాయత్‌సాగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్ మిలన్ సేవా కార్యక్రమాన్ని న్విహించారు. ఈ సందర్భంగా చిన్నారుల సంరక్షణ, విద్య, పోషణతో పాటు వారి సమగ్ర అభివద్ధి కోసం నిరంతరం అంకితభావంతో సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సమాజంలో చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యపై అవగాహన కల్పించడంతో పాటు వారికి అవసరమైన సేవలను అందిస్తూ అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న కషి అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు సేవలు అందించడంతో పాటు, ప్రజల కోసం నిస్వార్థంగా పని చేస్తున్న సేవా కార్యకర్తలను, సిబ్బందిని గౌరవించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా పని చేస్తున్నాయని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా అంగన్‌వాడీ టీచర్లను ప్రోత్సహించడం, వారి సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా పీరంచెరువు, హైదర్ షా కోట్, బైరాగిగూడ, హిమాయత్ సాగర్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లను సన్మానించి, వారికి అభినందనలు తెలిపారు. చిన్నారుల కోసం వారు అందిస్తున్న సేవలను నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌భూపాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజ.ఏపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్‌ముదిరాజ్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, బీజేవైఎం అధ్యక్షులు కొండె మహేష్‌యాదవ్, ఉపాధ్యక్షులు నరేష్‌యాదవ్, బీజేపీ మహిళా మోర్చా నాయకులు, స్థానిక బీజేపీ నాయకులు స్వర్ణలతారెడ్డి, నరేష్‌యాదవ్, పవన్‌సాయి, మల్లారెడ్డి, మహాలింగం, గోపాల్, భగవంతరెడ్డి, మహిళా మోర్చా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, మహిళలు, స్థాని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# టిజెఎంయు గౌరవ అధ్యక్ష పదవికి అనంత కిషన్ రాజీనామా

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 06: ఆర్టీసీ కార్మికుల ఎన్నికలకు మరో మూడు రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ టిజెఎంయు సంగారెడ్డి డిపో గౌరవ అధ్యక్ష పదవికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ రాజీనామా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు మద్దతు ఇస్తున్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు టిజెఎంయు పదవికి రాజీనామా చేసి టి డబ్ల్యూ కు మద్దతు ప్రకటిస్తున్నట్లు అనంత కిషన్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు తాను టిజెఎంయు పక్షాన ఉన్న సంగారెడ్డి ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు అనంత కిషన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ కార్మికుల ఎన్నికల్లో టి డబ్ల్యూ యు ను గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాద బాధిత కార్యకర్తను పరామర్శించిన నీలం మధు

### రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేత

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 06: రోడ్డు ప్రమాదంలో గాయపడి సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొల్లారం డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ మంగళవారం పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, చికిత్సకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం.....?

### రేవంత్ సర్కార్ పై సబితా ఇంద్రారెడ్డి ఫైర్...!

### తుక్కుగూడలో రూ.3.18 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సబితా ఇంద్రారెడ్డి

### ప్రజా సమస్యలు గాలికి --- మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని డిమాండ్



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ-మంకల్ డివిజన్ పరిధిలో రూ.3 కోట్ల 18 లక్షల 50 వేలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.రావిర్యాల ఓల్డ్ బ్రిడ్జి నుంచి సర్దార్ నగర్ వరకు డ్రైనేజీ పనులు, సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం ఆర్చ్ నుంచి రావిర్యాల వరకు బీటీ రోడ్డు, సీసీ రోడ్డు విస్తరణ పనులు, అలాగే ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి జన్నాయిగూడ వరకు రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తున్నారని, సరైన రోడ్డు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పనులు పూర్తయితే భక్తులు, స్థానికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.అనంతరం సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గత సీఎం కేసీఆర్ హయాంలో మున్సిపల్ ఫండ్ ద్వారా మంజూరైన రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. ప్రస్తుతం జి ఎచ్ ఎం సి ద్వారా నిలిచిపోయిన పనులకు తిరిగి నిధులు మంజూరు అవుతున్నాయని తెలిపారు.ప్రజా సమస్యలను గాలికి వదిలి ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వంటి మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. మంజూరైన పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# కృష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయానికి పూర్వ వైభవం

**వేగంగా కొనసాగుతున్న ఆలయ అభివృద్ధి పనులు.. గుడి చుట్టూ గ్రానైట్ పనులకు శ్రీకారం**

**ఆలయ అభివృద్ధికి రూ.60 వేల విలువైన గ్రానైట్‌ను అందించిన దాత మణిదీప్‌కు ఆర్. నరేష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు**





**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** సనాతన కాలం నాటి కృష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రం అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయం చుట్టూ విలువైన గ్రానైట్ ఏర్పాటు పనులను మంగళవారం పూజా కార్యక్రమాల అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్. నరేష్ కుమార్ కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. కృష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్ మిత్రులు, బీజేపీ ఎండోమెంట్ స్టేట్ గౌరవ సభ్యులు మణిదీప్ రూ. 60 వేల విలువైన గ్రానైట్‌ను ఆలయానికి దాతగా అందజేశారు. సనాతన హిందూ ధర్మ ప్రచారకర్తగా, చెందిప్ప మరకత శివలింగ నామకరణ భక్తుడిగా సేవలందిస్తున్న ఆర్. నరేష్ కుమార్ ఈ ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టి పలు కార్యక్రమాలను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో రావులపల్లి రామ లక్ష్మయ్య, ముదిరాజ్ జంగయ్య, భూపతి రెడ్డి, రావులపల్లి రాజు, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు**

ప్రతి పౌర్ణమి రోజున కృష్ణగిరి పాదాలగుట్ట వద్ద గిరిప్రదక్షిణ నిర్వహించడంతో పాటు స్వయంగా కృష్ణుని పాదాలకు, శ్రీ రాధాకృష్ణ విగ్రహాలకు అభిషేక పూజలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కూడా జరుగుతోంది. ఆలయ అభివృద్ధికి రూ. 60 వేల విలువైన గ్రానైట్‌ను అందించిన దాత మణిదీప్‌కు ఆర్. నరేష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో కృష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# సేవల రంగం జోరు

**సెప్టెంబర్‌లో 55.2కు పీఎంఐ సూచీ .. మూడు నెలల గరిష్టం**

న్యూఢిల్లీ: దేశీ డిమాండ్, కొత్త ఆర్డర్ల దన్నుతో సేవల రంగం జోరందుకుంది. సెప్టెంబర్‌లో హెచ్ఎస్‌బీసీ ఇండియా సర?వసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 55.2కు వృద్ధి చెందింది. ఆగస్టులో ఇది 54.1గా నమోదైంది. అయితే, గతంలో నమోదైన త్రైమాసిక సగటు కంటే సేవల కార్యకలాపాల్లో తాజా క్వార్టర్లో వృద్ధి తక్కువగానే నమోదు కావడం గమనార్హం. 2022 మార్చి తర్వాత ఈ ఆర్థిక సంవత్సరం జూలై--సెపట?టంబర్ త్రైమాసికంలో వృద్ధి అత్యంత బలహీనంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. సాధారణంగా పీఎంఐ సూచీ 50కి పైన ఉంటే వృద్ధి కింద.. 50కి దిగువున ఉంటే క్షీణత కింద పరిగణిస్తారు. సర్వే ప్రకారం.. డిజిటల్ సొల్యూషన్లు, ఆహారం, బీమా, రుణాలు, సాఫ్ట్‌వేర్, రవాణా, టూర్స్ అండ్ ట్రావెల్‌కు డిమాండ్ భారీగా పుంజుకుంది. అదేవిధంగా భారతీయ సర?వసులకు అంతర్జాతీయంగా డిమాండ్ కూడా.. ముఖ్యంగా జర్మనీ, యూఏఈ, యూకే, అమెరికా నుంచి మెరుగుపడింది. ఇక ఉద్యోగాల విషయానికొస్తే, ఆర్డర్ బుక్స్, ప్రాజెక్టులు పుంజుకోవడంతో సెపట?టంబర్ క్వార్టర్లో కంపెనీలు అదనపు ఉద్యోగులను నియమించుకున్నాయి.




# పాత కంప్యూటర్ స్పీడ్ పెంచే జియో సర్వీస్

కంప్యూటర్ కొన్నేళ్లు వాడిన తర్వాత నెమ్మదించడం సహజమే. స్టోరేజ్ తగ్గిపోవడం, ర్యామ్ సరిపోకపోవడం, కొత్త సాఫ్ట్‌వేర్‌లు సరిగ్గా పనిచేయకపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమయంలో.. చాలామంది కొత్త కంప్యూటర్ కొనాలని ఆలోచిస్తారు. కానీ అలాంటి వారికోసం రిలయన్స్ జియో 'జియోపీసీ' సేవలను తీసుకొచ్చింది. జియోపీసీ అనేది ఒక క్లౌడ్ ఆధారిత కంప్యూటింగ్ సర్వీస్. అంటే.. మీ దగ్గర ఉన్న పాత కంప్యూటర్‌లోనే క్లౌడ్ ద్వారా అదనపు ర్యామ్, స్టోరేజ్, కంప్యూటింగ్ పవర్‌ను ఉపయోగించుకోవచ్చు. దీంతో కంప్యూటర్ పాతదైనా కొత్త అప్లికేషన్లు, సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించే అవకాశం ఉంటుంది. గతంలో జియోపీసీ అనేది కేవలం జియోహోమ్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఏ కంపెనీకి చెందిన ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్నా.. ఈ సేవను తీసుకోవచ్చు. అంటే జియో సిమ్ లేదా జియో బ్రాడ్‌బ్యాండ్ తప్పనిసరి కాదు.

**రూ.1,000 నుంచే ప్లాన్స్!**

జియోపీసీలో ప్రస్తుతం రెండు రకాల ఆప్షన్లు ఉన్నాయి. సాధారణ జియోపీసీ ప్లాన్‌లో 8జీబీ ర్యామ్, 500 జీబీ స్టోరేజ్ లభిస్తుంది. జియోపీసీ అల్ట్రాలో 16 జీబీ ర్యామ్, 1 టీబీ స్టోరేజ్ లభిస్తుంది. రెండు నెలల జియోపీసీ ప్లాన్ ధర రూ. 1,000 నుంచి ప్రారంభమవుతుంది. జియోపీసీ అల్ట్రా రెండు నెలలకు రూ. 1,200గా ఉంది. ఏడాదికి కావాలంటే కూడా దీనికోసం తగిన ప్లాన్ ఎంచుకోవచ్చు. దీనికోసం సంస్థ మల్టిపుల్ ప్లాన్స్ అందిస్తోంది. మూడు, నాలుగేళ్లుగా కంప్యూటర్లను వాడుతున్న వారికి జియోపీసీ చాలా ఉపయోగపడుతుంది. ఎనిమిదేళ్ల పాత కంప్యూటర్లలో కూడా జియోపీసీ ద్వారా ఏఐ ఆధారిత అప్లికేషన్లను ఉపయోగించుకోవచ్చని కంపెనీ చెబుతోంది. ఎందుకంటే.. ఎక్కువ కంప్యూటింగ్ అవసరమయ్యే పనులు క్లౌడ్‌లో జరుగుతాయి. పాత కంప్యూటర్ ఉపయోగించేవారు.. రిలయన్స్ జియో తీసుకొచ్చిన జియోపీసీ ఉపయోగించుకుంటే బహుశా వెంటనే కొత్త కంప్యూటర్ కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండకపోవచ్చు.

# ఎప్పుడూ విమానంలో ఉంటారు..

**విమానంలో ఉద్యోగం చాలామందికి డ్రీమ్ జాబ్. ముఖ్యంగా విమానంలో ప్రయాణికులందరినీ చిరునవ్వుతో పలకరించే క్యాబిన్ క్రూ ఉద్యోగం అంటే ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. ప్రయాణాలు, కొత్త వ్యక్తులతో పరిచయాలు, విమానయాన రంగంలో కెరీర్.. ఇలా ఎన్నో ఆకర్షణలు ఈ ఉద్యోగంలో ఉన్నాయి. దేశంలో వేగంగా విస్తరిస్తున్న విమానయాన సంస్థల్లో ఒకటైన ఇండిగోలో క్యాబిన్ క్రూగా పనిచేస్తున్నవారు ఎంత సంపాదిస్తున్నారో తెలుసుకోవాలని చాలామందికి ఉంటుంది. ఈ నేపథ్యంలో 2026లో అందుబాటులో ఉన్న పరిశ్రమ అంచనాల ప్రకారం అనుభవాన్ని బట్టి ఇండిగో క్యాబిన్ క్రూ సంపాదనలెంతో ఈ కథనంలో తెలుసుకుందాం..**




**కొత్తగా చేరేవారికి ఇలా..**

ఏవియేషన్ ఇూ2 నివేదిక ప్రకారం, ఇండిగోలో కొత్తగా క్యాబిన్ క్రూగా చేరినవారు సాధారణ ఫ్లయింగ్ డ్యూటీలు ప్రారంభించిన తర్వాత నెలకు సుమారు రూ. 40,000 నుంచి రూ. 55,000 వరకు సంపాదించవచ్చు. అయితే ఇది స్థిరమైన జీతంగా భావించకూడదు. ఫ్లయింగ్ గంటలు, నెలవారీ రోస్టర్, రూట్, ప్రోత్సాహకాలు, పనిచేసే బేస్ లొకేషన్ వంటి అంశాల ఆధారంగా అసలు నెలవారీ ఆదాయం మారవచ్చు.

**అనుభవం పెరిగితే..**

రెండు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల అనుభవం, ఎక్కువ ఫ్లయింగ్ యాక్టివిటీ ఉన్న క్యాబిన్ క్రూకు ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న పరిశ్రమ అంచనాల ప్రకారం అనుభవజ్ఞులైన సిబ్బంది నెలకు రూ. 60,000--రూ. 85,000 వరకు సంపాదించవచ్చు. ఇందులో ఫ్లయింగ్ అలవెన్సులు, ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాలు, రూట్ అసైన్‌మెంట్లు వంటి అంశాలు ప్రభావం చూపుతాయి. అందుకే ప్రతి నెలా వచ్చే మొత్తం ఒకేలా ఉండకపోవచ్చు.

**సీనియర్ స్థాయిలో రూ.1.2 లక్షల వరకు..**

కెరీర్‌లో ముందుకు వెళ్లి లీడ్ క్యాబిన్ అటెండెంట్ లేదా ఇన్‌ఫ్లైట్ సూపర్‌వైజర్ వంటి బాధ్యతలు చేపట్టినవారికి ఆదాయం మరింత ఎక్కువగా ఉండొచ్చని ఏవియేషన్ ఇూ2 అంచనా వేసింది. బలమైన ఫ్లయింగ్ షెడ్యూల్, అధిక బాధ్యతలు ఉన్న సమయంలో వీరి నెలవారీ సంపాదన సుమారు రూ. 90,000 నుంచి రూ. 1.20 లక్షల వరకు ఉండొచ్చు.

**జీతంతో పాటు మరిన్ని ప్రయోజనాలు**

క్యాబిన్ క్రూ ఆదాయం కేవలం బేసిక్ పేకు పరిమితం కాదు. ఫ్లయింగ్ అలవెన్సులు, కొన్ని సందర్భాల్లో లేఓవర్ సంబంధిత ప్రయోజనాలు, స్టాఫ్ ట్రావెల్ వంటి సదుపాయాలు మొత్తం ప్యాకేజీలో భాగం కావచ్చు. ముఖ్యంగా అంతర్జాతీయ కార్యకలాపాలు పెరుగుతున్న కొద్దీ రూట్, డ్యూటీ స్వభావం కూడా ఆదాయంపై ప్రభావం చూపే అంశంగా మారుతోంది.

**మూడు నెలల శిక్షణ తప్పనిసరి**

ఇండిగో అధికారిక సమాచారం ప్రకారం, విమానంలో ఫ్లయింగ్ క్రూగా విధులు ప్రారంభించే ముందు క్యాబిన్ క్రూ సిబ్బంది మూడు నెలలపాటు ఇంటెన్సివ్ ట్రైనింగ్ పొందుతారు. ప్రయాణికుల భద్రత, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం, సేవా ప్రమాణాలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

# సంపాదించటం అనేది ఒక స్వభావం

**డబ్బు సంపాదనను కేవలం అంకెలతో కొలవలేమనీ, అది మన ప్రవర్తన, భావోద్వేగాలు, నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందనీ మోర్గాన్ హౌసెల్ అంటు న్నారు. జీవితంలో నిజమైన ఆర్థిక విజయాన్ని పొందడమే కాకుండా, మనశ్శాంతితో కూడిన తృప్తికరమైన జీవితాన్ని ఎలా గడపాలో చెబుతున్నారు.**

**కూడబెట్టటం... కాపాడుకోవటం**

"ఆర్థిక విజయం సాధించడానికి మీరు ఎంత తెలివైన వారు, చదువులో ఎంత ప్రతిభ చూపారు లేదా ఏ కాలేజీలో చదివారు అనే వాటితో పెద్దగా సంబంధం ఉండదు. ఉదాహరణకు, గ్రేస్ గ్రోనర్ అనే మహిళ దశాబ్దాల పాటు ఒక సాధారణ కార్యదర్శిగా పని చేశారు. ఆమె చాలా మామూలు జీవితం గడుపుతూ, క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టేవారు. ఆమె చనిపోయే నాటికి కోట్లాది రూపాయల ఆస్తి జమయింది! దీనికి భిన్నంగా, లక్షల రూపాయలు సంపాదించే వాల్ స్ట్రీట్ ఎగ్జిక్యూటివ్‌లు లేదా గొప్ప వ్యాపారవేత్తలను చూడండి. అతిగా అప్పులు చేసి, రిస్క్ తీసుకోవడం వల్ల వారు తమ సంపదనంతా పోగొట్టుకున్నారు. శ్రీమంతులు అవటానికి కావాల్సిన నైపుణ్యాలు వేరు, శ్రీమంతులుగా కొనసాగడానికి కావాల్సిన స్వభావాలు వేరు.

**శ్రీమంతులు రెండు రకాలు**

రాక్‌ఫెల్లర్, వాండర్‌బిల్ట్ కుటుంబాల మధ్య ఉన్న పెద్ద వ్యత్యాసాన్ని చూడండి. కార్నెలియస్ వాండర్‌బిల్ట్ మానవ చరిత్రలోనే అతిపెద్ద సంపదలలో ఒక దానిని సృష్టించాడు. కానీ కొద్ది తరాల్లోనే అతని వారసులు విలాసవంతమైన భవనాలు, అద్భుతమైన పార్టీలతో ఆ డబ్బునంతా నీళ్లలా ఖర్చు చేశారు. మరోవైపు, రాక్‌ఫెల్లర్ కుటుంబం అలా చేయలేదు. ఒక సరైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. తమ పిల్లలకు స్థాయికి మించి ఖర్చు చేయకుండా నిరాడంబరంగా బతకడం నేర్పించారు. మీ సమయాన్ని, స్వేచ్ఛను తిరిగి పొందడానికి డబ్బును ఒక సాధనంగా వాడటం ఆపి, మిమ్మల్ని అస్సలు పట్టించుకోని వారిని ఆకట్టుకోవటం కోసం ఒక ప్రదర్శనగా మార్చిన మరుక్షణమే తరతరాల సంపద నాశనం అవటం ప్రారంభమౌతుంది.



**చిన్నప్పటి దుర్భర జీవితం**

మీ చిన్నతనంలో చూసిన పరిస్థితులే మీ జీవితాంతం మీరు తీసుకునే ఆర్థిక నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఒక వ్యక్తి స్థోమతకు మించిన ఖరీదైన కారు, పెద్ద ఇల్లు లేదా అవసరం లేకపోయినా బ్రాండెడ్ వస్తు వులు కొనడం చూసినప్పుడు, వారు ఏదో ఆలోచించి ఆ నిర్ణయం తీసుకుంటున్నారని అనుకోకండి. చాలా సందర్భాల్లో, తమ చిన్నతనంలో అనుభవించిన పేదరికం, అభద్రతాభావం లేదా అవమానాలను మర్చిపోవడానికి వారు అలా చేస్తుంటారు. కానీ అసలు సమస్య ఏంటంటే, వస్తువులను కొని మనసులోని పాత గాయాలను మాన్పించుకోవాలని చూడటం ముగింపు లేని, తీర్చలేని ఒక పెద్ద అప్పు లాంటిది.

**శాశ్వత తృప్తి... తాత్కాలిక సంతోషం**

సంతోషం అనేది కొద్దిసేపు మాత్రమే ఉండే ఒక తాత్కా లిక భావోద్వేగం. ఉదాహరణకు, మీరు కొత్త కారు కొన్నప్పుడు లేదా వ్యాపారంలో ఒక గొప్ప విజయాన్ని సాధించినప్పుడు కలిగే క్షణికమైన ఆనందం అది. కానీ తృప్తి అనేది శాశ్వతమైన మనశ్శాంతి. 'నాకు ఉన్నది చాలు' అనే భావనతో ఉండటమే తృప్తి. మీ ఫలితాలతో (సంపాదనతో) పాటే మీ ఆశలు కూడా పెరుగుతూ ఉంటే, మీరు జీవితంలో ఎప్పటికీ శ్రీమంతులుగా అనుభూతి చెందలేరు. మీ ఆశయాలకు ఒక సరిహద్దు అంటూ లేకపోతే, మీ జీవితమంతా ఒక ట్రెడ్‌మిల్ మీద పరిగెత్తినట్లే ఉంటుంది. ఒక గమ్యాన్ని చేరుకోవడం అనేది విశ్రాంతిని ఇవ్వకపోగా, తర్వాతి పరుగు పందెం కోసం మరింత ఒత్తిడితో కూడిన ప్రారంభ స్థానంగా మారుతుంది. –

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.